www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -09 బుధవారం 22 ఏప్రిల్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# బస్సులు బంద్

- ప్రభుత్వంతో కార్మిక సంఘాల చర్చలు విఫలం
- సమ్మెలోకి 39 వేల మంది ఆర్టీసీ కార్మికులు
- హడావిడిగా ఐఏఎస్‌ల కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- జేఏసీని నాలుగు వారాల గడువు కోరిన కమిటీ
- తిరస్కరించిన ఆర్టీసీ కార్మిక సంఘాలు
- మా డిమాండ్లన్నీ పాతవేనని స్పష్టీకరణ
- నిలిచిపోనున్న 10వేల ఆర్టీసీ సర్వీసులు

**హైదరాబాద్‌ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ)లో సమ్మె సైరన్ మోగింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 53 రోజుల చారిత్రాత్మక సమ్మె తర్వాత సంస్థలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా మరోసారి సమ్మెలోకి వెళ్లాయి. సమ్మెలోకి వెళ్తామని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ నేతలు ముందుగానే కార్మిక శాఖ ద్వారా నోటీసు ఇచ్చి, ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అయినా ప్రభుత్వం సమ్మె నివారణకు ప్రత్యేకంగా ఎలాంటి చర్యలు తీసుకోలేదు**మిగతా 2లో...**



# కేరళలో బాణసంచా పేలుడు

**13 మంది మృతి, పలువురికి గాయాలు..**



**తిరువనంతపురర్ ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** కేరళలోని త్రిసూర్‌లో మంగళవారం బాణాసంచా తయారీలో భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 13 మంది మృతి చెందగా, పలువరు గాయపడ్డారని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది. రాష్ట్ర యంత్రాంగాన్ని సహాయచర్యల నిమిత్తం పంపించామని ముఖ్యమంత్రి పినరయి విజయన్ తెలిపారు. త్రిస్సూర్‌లో బాణసంచా పేలుడు కారణంగా తలెత్తిన అత్యవసర పరిస్థితిని ఎదుర్కోవడానికి రాష్ట్ర విపత్తు సహాయ నిధి నుండి**మిగతా 2లో...**

# ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

**ట్రాన్స్‌ఫర్లకు మే 1 నుంచి 31 వరకు అవకాశం - ప్రభుత్వ ఉత్తర్వులు జారీ**

**హైదరాబాద్‌ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై నిషేధాన్ని ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీల ప్రక్రియ మే 1 నుంచి 31 వరకు కొనసాగుతుందని ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. జూన్ 1 నుంచి తిరిగి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొంది. ఈ ఏడాది జనవరి 1 నాటికి ఒకే చోట మూడేండ్లు పూర్తి చేసుకున్న ఉద్యోగులు బదిలీకి అర్హులు. అయితే నాలుగేండ్లు పూర్తి చేసుకున్న వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉంటుంది. 2027 మే 31కి ముందు ఉద్యోగ విరమణ చేయనున్న ఉద్యోగులకు దీన్నుంచి మినహాయింపు ఉంటుంది. వీరు బదిలీని కోరుకునే అవకాశం వారికే కల్పిస్తారు. జీవిత భాగస్వామి ఆధారంగా కోరుకునే బదిలీలకు మూడేండ్ల నిబంధన వర్తించదని జీవోలో స్పష్టం చేశారు. ఏ ఒక్క క్యాడర్‌లో కూడా 40శాతం కంటే ఎక్కువ మంది ఉద్యోగుల**మిగతా 2లో...**



# కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి?

**సకల జనులను దగా చేసినందుకా**

**ఓటుకు నోటు కేసులో రేవంత్ జైలుకెళ్లడం ఖాయం**

**కాళేశ్వరం, ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసుల కోసమే ఢిల్లీకి వెళ్లా : మాజీమంత్రి హరీశ్‌రావు**




**హైదరాబాద్ ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** కాంగ్రెస్‌కు ప్రజలు మళ్లీ ఓటు ఎందుకు వేయాలని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీమంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రశ్నించారు. ఇచ్చిన హామీలను అమలు చేయనందుకా?, సకల జనులను దగా చేసినందుకా?, రాష్ట్రాన్ని స్కాములతో నింపినందుకు ఓటు వేయాలా? దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు సీనియర్ న్యాయవాదులను కలిసేందుకే తాను, ఎంపీ రవిచంద్ర, మాజీ ఎంపీ వినోద్ కుమార్ శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి ఢిల్లీకి వెళ్లామనీ, అందులో దాచిపెట్టేదేం లేదని చెప్పారు. కాళేశ్వరం కేసులో తీర్పు ఏ విధంగా వచ్చినా సుప్రీంకోర్టుకు వెళ్లాల్సి ఉంటుందనీ, వచ్చేనెల ఆరో తేదీన హైకోర్టులో రాబోతున్న ఎమ్మెల్యేల**మిగతా 2లో...**

# ముగిసిన ప్రచారం

**తమిళనాడులో**

**బెంగాల్‌లో తొలి దశకు కూడా..**



2లో.

# చర్చలకు ఇరాన్ నో

**ఒప్పందం కుదరకపోతే బాంబు దాడులే : ట్రంప్ బెదిరింపు**

**ఎలాంటి చర్యలకైనా సిద్ధం : ఇరాన్**

**నేటితో ముగియనున్న కాల్పుల విరమణ ఒప్పందం**

**నేడు ఇస్లామాబాద్‌కు అమెరికా, ఇరాన్ బృందాలు : పాకిస్తాన్**





**ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ం కాల్పుల విరమణ ఒప్పందం మరికొన్ని గంటల్లో ముగియబోతున్న నేపథ్యంలో ఇరాన్, అమెరికా మధ్య పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో జరగాల్సిన శాంతి చర్చలపై అనిశ్చితి కొనసాగుతోంది. అమెరికాతో రెండో విడత చర్చలు జరిపే ప్రశ్నే లేదని ఇరాన్ తేల్చి చెప్పింది. అమెరికా డిమాండ్ల చిట్టా పెరిగిపోతోందని, అవాస్తవ అంచనాలు వేస్తోందని, వైఖరిని తరచూ మార్చుకుంటోందని, పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తోందని మండిపడింది.**మిగతా 2లో...**

# 27న బీఆర్ఎస్ ప్రత్యేక సమావేశం

**కేసీఆర్ అధ్యక్షతన జరిగే భేటీలో పాల్గొననున్న ముఖ్య నేతలు**

**పార్టీ సంస్థాగత నిర్మాణం, తాజా రాజకీయాలపై చర్చ**



2లో.

# కూసుమంచిలో సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్

**ప్రతి భూమికి సర్వే మ్యాప్, భూధార్ నంబర్: పొంగులేటి**



**హైదరాబాద్, ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేస్తూ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో భూభారతి ఇంటిగ్రేటెడ్ పోర్టల్‌ను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, భూముల రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ ఉండాలన్న నిబంధననూ అమలు చేస్తున్నామని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలంలోని మోటాపురం గ్రామంలో సర్వే నంబరు 156/ఇ/1లో ఎకరా నాలుగు గుంటల భూమికి సర్వే మ్యాప్‌తో తొలి రిజిస్ట్రేషన్ జరిగిందని వెల్లడించారు. గ్రామానికి చెందిన భాగం కిషన్‌రావు అనే రైతు అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావుకు భూమిని విక్రయించారని.. రిజిస్ట్రేషన్ సందర్భంగా తహసీల్దార్ భూ పటాన్ని, భూధార్ నంబరును కేటాయించినట్లు పేర్కొన్నారు. ఈ విధానాన్ని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. భూభారతి చట్టం ద్వారా ప్రతి భూమికి ఖచ్చితమైన సర్వే మ్యాప్, ప్రత్యేక భూధార్ నంబరు కేటాయిస్తామని తెలిపారు. ఇలా చేయడం వల్ల భూ హక్కులకు సంబంధించి ఎలాంటి సందేహాలకు తావుండదన్నారు. భూ హక్కులకు భరోసా కల్పిస్తామని, భూభారతి పోర్టల్ దేశానికే ఆదర్శంగా నిలవనుందని ఆయన తెలిపారు.

# కేరళలో బాణసంచా పేలుడు

**మొదటిపేజీ తరువాయి**

తక్షణమే రూ. 50 లక్షలను విడుదల చేస్తున్నట్లు కూడా ఆయన ప్రకటించారు. ప్రధాని మోడీ పెలుడు ఘటనపై స్పందించారు. మృతుల కుటుంబాలకు 2 లక్షలు, గాయపడిన వారికి 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు.వివరాలకు సంబంధించి ముండతికోడ్‌కు చెందిన సతీసన్ అనే వ్యక్తి నడుపుతున్న ఈ కేంద్రంలో, తిరువంబడి దేవస్థానం నిర్వహించే నమూనా ప్రదర్శన, ప్రధాన త్రిస్సూర్ పూరం బాణాసంచా ప్రదర్శన రెండింటికీ అవసరమైన బాణాసంచా సామాగ్రిని ఐదు టెంట్లలో నిల్వ చేశారు. పూరం కోసం సన్నాహాలు జరుగుతున్న సమయంలో జరిగిన ఈ పేలుడు సమయంలో 40 మందికి పైగా కార్మికులు ఉన్నారని తెలుస్తోంది. కొనసాగుతున్న పేలుళ్లు, దట్టమైన పొగ కారణంగా సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. తీవ్రంగా గాయపడిన వారిని త్రిస్సూర్ మెడికల్ కాలేజ్ ఆసుపత్రిలో చేర్చారు. సమీపంలోని అన్ని ఆసుపత్రులను పూర్తి అప్రమత్తంగా ఉంచాలని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ఆదేశించారు. అయితే ఈ పేలుడుకు గల కారణాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

# ముగిసిన ప్రచారం

## తమిళనాడులో -బెంగాల్‌లో తొలి దశకు కూడా..

న్యూఢిల్లీ : ఐదు అసెంబ్లీలకు ఎన్నికల్లో భాగంగా తమిళనాడులో మంగళవారం సాయంత్రం 6 గంటలతో ప్రచార పర్వం ముగిసింది. అలాగే, పశ్చిమ బెంగాల్‌లోని తొలి దశకు కూడా మంగళవారం సాయంత్రంతో ప్రచారం ముగిసింది. వీటికి ఈ నెల 23న ఎన్నికలు జరగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ ఓటింగ్‌కు అనుమతిస్తారు. ఎన్నికలకు 48 గంటలు ముందు ప్రచారాన్ని తప్పనిసరిగా ముగించాలనే విషయం తెలిసిందే. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు గురువారం ఒకే దశలో ఎన్నికలు జరగనున్నాయి. డిఎంకె, అన్నాడిఎంకె వాటి మిత్రపక్షాల మధ్య పోటీ ప్రధానంగా ఉంది. ప్రముఖ సినీ నటుడు విజరు పార్టీ టివికె ప్రభావం ఎంత ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది. 4 వేల మందికి పైగా అభ్యర్థులు బరిలో ఉన్నారు. 5.73 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. అలాగే, బెంగాల్‌లో గురువారం తొలిదశలో 152 స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. మిగిలిన 142 స్థానాలకు రెండో దశలో ఈ నెల 29న ఎన్నికలు జరగున్నాయి. దీంతో ఐదు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటింగ్ ప్రక్రియ ముగిస్తుంది. మే 4న ఫలితాలను ప్రకటించనున్నారు. ఇప్పటికే అస్సాం, పుదుచ్చేరి, కేరళలో ఓటింగ్ ముగిసిన సంగతి తెలిసిందే.

# ఉద్యోగాల బదిలీలపై నిషేధం ఎత్తివేత

బదిలీ చేయకూడదు. బదిలీల ప్రక్రియ మొత్తం కౌన్సెలింగ్ పద్ధతిలో సాధ్యమైనంత వరకు ఆన్‌లైన్/వెబ్ ఆధారిత అప్లికేషన్ ద్వారా పారదర్శకంగా జరగాలని ప్రభుత్వం ఆదేశించింది. అలాగే బదిలీల సమయం లో భార్యాభర్తలు (ఒకరికి మాత్రమే), ఉద్యోగ విరమణకు దగ్గరలో ఉన్నవారు, 70 శాతం కంటే ఎక్కువ వైకల్యం ఉన్నవారు, మానసిక వికలాం గులైన పిల్లలున్న తల్లిదండ్రులు, వితంతువులు, క్యాన్సర్, న్యూరో సర్జరీ, కిడ్నీమార్పిడి, లివర్ మార్పిడి, ఓపెన్ హార్ట్ సర్జరీ, బోన్ టీబీ వంటి వైద్య అవసరాలు కలిగిన వారికి ప్రాధాన్యతనిస్తారు. అయితే నిబంధనలను ఉల్లంఘిస్తే మాత్రం కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం హెచ్చరించింది. సెన్సస్ (జనాభా గణన) సంబంధిత పనుల్లో ఉన్న ఉద్యోగులకు ఈ నిబంధనలు వర్తించబోవని స్పష్టం చేసింది. బదిలీల ప్రక్రియను పర్యవేక్షిం చడానికి క్యాడర్ వారీగా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం జీవోలో స్పష్టం చేసింది. స్టేట్, మల్టీ-జోనల్/జోనల్, జిల్లా స్థాయిల్లో అధికారుల నేతత్వంలో ఈ కమిటీలు పని చేయనున్నాయి.

**బదిలీల షెడ్యూల్ వివరాలు**

మే 1-7: బదిలీల విధివిధానాల ఖరారు. ఖాళీ పోస్టులు, తప్పనిసరిగా బదిలీ చేయాల్సిన ఉద్యోగుల జాబితా సిద్ధం చేసి ప్రచురిస్తారు.

మే 8- 15: ఉద్యోగులు తమకు కావలసిన బదిలీ ప్రాంతాల కోసం ఆప్షన్లను సమర్పించాలి.

మే 16- 24: సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి బదిలీ విధానం ప్రకారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అనంతరం మాస్టర్ లిస్ట్‌ను సిద్ధం చేస్తారు.

మే 25-31: బదిలీ ఉత్తర్వుల జారీ. బదిలీ ఉత్తర్వులు వెలువడిన 3 రోజుల్లోపు ఉద్యోగులు విధుల నుంచి రిలీవ్ కావాలి.

# తెలంగాణలో పెట్టుబడులకు అవకాశం


## నార్వే బృందందతో మంత్రి శ్రీధర బాబు

**హైదరాబాదఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ంతెలంగాణలో పెట్టుబడుల కోసం నార్వే కంపెనీలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం పలికారు. లైఫ్ సైన్సెస్, హెల్త్ కేర్ రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయని మంత్రి వివరించారు. మంత్రి శ్రీధర్ బాబుతో నార్వే ప్రతినిధులు ఈరోజు మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. మే ఎలిన్ స్టైనర్ నేతృత్వంలో హై లెవల్ డెలిగేషన్ సమావేశం జరిగింది. ఈ భేటీలో పలు కీలక అంశాలపై మంత్రితో వారు చర్చించారు. 'తెలంగాణ-నార్వే' ద్వైపాక్షిక సహకారంపై కీలక చర్చలు జరిగాయి. పరిశ్రమల ఏర్పాటుకు రాష్ట్రంలో అనుకూల విధానాలు ఉన్నాయని తెలిపారు. క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ మొబిలిటీ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలు ఉన్నాయని వెల్లడించారు. ఏఐ, ÷-లక్లైమేట్ టెక్, హెల్త్ టెక్ రంగాల్లో కలసి పని చేసేందుకు రోడ్ మ్యాప్ సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. 'తెలంగాణ-నార్వే వర్కింగ్ గ్రూప్' ఏర్పాటు ప్రతిపాదనపై కూడా చర్చించారు. పెట్టుబడులకు తెలంగాణతో కలిసి పనిచేయడానికి నార్వే సిద్ధమని రాయబారి వెల్లడించారు.

# 27న బీఆర్ఎస్ ప్రత్యేక సమావేశం

## కేసీఆర్ అధ్యక్షతన జరిగే భేటీలో పాల్గొననున్న ముఖ్య నేతలు

## పార్టీ సంస్థాగత నిర్మాణం, తాజా రాజకీయాలపై చర్చ



**హైదరాబాదఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ంబీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం, పార్టీ రజతోత్సవ సంబరాల ముగింపును పురస్కరించుకొని ఈనెల 27న ఆ పార్టీ అధినేత కె.చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. తెలంగాణ భవన్‌లో మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో పార్టీ ముఖ్య నేతలందరూ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా సంస్థాగత నిర్మాణం, పార్టీ బలోపేతంపై దృష్టిపెట్టాల్సిన అంశాలపై కేసీఆర్ మాట్లాడనున్నారు. ముఖ్యంగా పార్టీ సభ్యత్వాల నమోదు, పునరుద్ధరణ వంటి అంశాలపైనా సుదీర్ఘంగా చర్చించనున్నారు. మారుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో పార్టీ క్యాడర్‌ను ముందుకు తీసుకెళ్లడం, సభ్యత్వ నమోదు ప్రక్రియను వేగవంతం చేసే అంశాలపై కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణపై కూడా ఈ భేటీలో స్పష్టతరానుంది. బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తప్పనిసరిగా హాజరుకావాలని పార్టీ ఆదేశించింది. మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్లను కూడా ఈ భేటీకి ఆహ్వానించినట్లు బీఆర్ఎస్ వర్గాలు తెలిపాయి.

# బస్సులు బంద్



**మొదటిపేజీ తరువాయి**

సమ్మె అనివార్యమని నిర్ధారణ కావడంతో హడావిడిగా మంగళవారం మధ్యాహ్నం నాలుగు శాఖల ఐఏఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేస్తూ జీవో 66 విడుదల చేసింది. ఈ కమిటీలో ఐఏఎస్ అధికారులు వికాస్‌రాజ్, దానకిషోర్, సందీప్‌కుమార్ సుల్తానీయా, ఎండీ వై నాగిరెడ్డి ఉన్నారు. వీరు ఆర్టీసీ కార్మిక సంఘాలను సచివాలయంలో చర్చలకు రావాలని ఆహ్వానించారు. జేఏసీలోని కార్మిక సంఘాలతో పాటు సమ్మెకు మద్దతు తెలుపుతున్న టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, టీఎమ్‌యూ (అశ్వత్థామరెడ్డి), ఐఎన్‌టీయూసీ సంఘా లు కూడా చర్చలకు వెళ్లాయి. కమిటీ నూతనంగా ఏర్పడినందున సమస్యల్ని అధ్యయనం చేసేందుకు తమకు నాలుగు వారాల సమయం కావాలని ఐఏఎస్‌ల కమిటీ కోరింది. ఈ ప్రతిపాదనను జేఏసీతో పాటు కార్మిక సంఘాలన్నీ తీవ్రంగా వ్యతిరేకించాయి. తమ డిమాండ్లు కొత్తవేం కాదని తేల్చిచెప్పాయి. సమ్మెను నిర్వీర్యం చేసే కుట్రగా పేర్కొన్నాయి. మంగళవారం అర్ధరాత్రి మొదటి డ్యూటీ నుంచే కార్మికులంతా సమ్మెలోకి వెళ్తున్నట్టు ఆర్టీసీ జేఏసీ ప్రకటించింది. ఆర్టీసీ కార్మికులు తప్పనిసరి పరిస్థితుల్లోనే సమ్మెకు వెళ్తున్నారనీ, తమ 32 డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు పోరడ తామని టీజీఎస్‌ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఈదురు వెంక న్న, వైస్‌చైర్మెన్ ఎమ్ థామస్‌రెడ్డి స్పష్టం చేశారు.

**ఉద్దేశపూర్వక జాప్యం**

బీఆర్ఎస్ హయాంలో ఆర్టీసీ కార్మికులు 53 రోజులు సమ్మె చేసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ప్రతిపక్షంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపింది. అధికారంలోకి వస్తే ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు దాటినా, ఇప్పటికీ ఆర్టీసీ కార్మికుల ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదు. దీనిపై కార్మిక సంఘాల వివిధ రూపాల్లో అనేక ఆందోళనలు చేపట్టాయి. సంస్థలో ఇప్పటికీ ఆనాటి కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన యూనియన్ల రద్దు ఉత్తర్వులే అమల్లో ఉన్నాయంటూ యాజమాన్యం కార్మికశాఖ వద్ద జరిగే చర్చలకు కూడా హాజరుకాలేదు. అనివార్యంగా ఆర్టీసీ కార్మికుల సమ్మెబాట పట్టాల్సి వచ్చింది.

**ప్రయాణీకులకు ఇబ్బందులు**

ఆర్టీసీ కార్మికుల సమ్మెతో రాష్ట్రంలో పల్లెవెలుగు నుంచి రాజధాని ఎక్స్‌ప్రెస్ బస్సుల వరకు నిలిచి పోనున్నాయి. దాదాపు 10వేల బస్సుల డిపోలకే పరిమితం అవుతున్నాయి. ఆర్టీసీలోని అద్దె బస్సుల సిబ్బంది కూడా సమ్మెకు సంఘీభావంగా విధులు బహిష్కరిస్తున్నట్టు ప్రకటించారు. సమ్మెతో రాష్ట్రంలో సామాన్య ప్రజలకు రవాణా కష్టాలు తప్పవు.

97 డిపోల్లో..10 వేల బస్సులు

రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీకి 97 డిపోల్లో 10 వేల బస్సులు ఉన్నాయి. వీటిలో దాదాపు 3,500 అద్దె బస్సులు ఉన్నాయి. సంస్థలో 39 వేల మంది కార్మికు లు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఈ బస్సులు రోజుకు 36 లక్షల కిలోమీటర్ల మేర ప్రయాణం చేస్తున్నాయి.

**సమస్యల పరిష్కారానికి సానుకూలం: మంత్రి పొన్నం**

తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై తమ ప్రభుత్వం సానుకూలంగా ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ విషయంలో నిర్ణయాలు తీసుకోవడంలో కొంత జాప్యం జరిగిందని అంగీకరించారు. ఆర్టీసీ కార్మికులు లేవనెత్తిన అన్ని అంశాలను పరిశీలించేందుకు నలుగురు ఐఏఎస్ అధికారులతో ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేశామన్నారు. ఆర్టీసీ ప్రతినిధులంతా ఆ కమిటీకి సమస్యలు విన్నవిస్తే, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, తాను అధికారుల దగ్గర చర్చించి పరిష్కరిస్తామని చెప్పారు.

**కమిటీ ఏర్పాటు**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నియమించిన కమిటీలో రవాణా, రహదారులు భవనాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కార్మిక, ఉపాధి, శిక్షణ, కర్మాగారాల శాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆర్థికశాఖ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సభ్యులుగా, టీజీఎస్‌ఆర్టీసీ వైస్ చైర్మెన్ మేనేజింగ్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు.

**స్పష్టమైన హామీ ఇవ్వలేదు : ఎస్‌డబ్ల్యూఎఫ్**

ప్రభుత్వం నియమించిన ఐఏఎస్‌ల కమిటీ ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారంపై స్పష్టమైన హామీ ఇవ్వలేక పోయిందని టీజీఎస్‌ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) ప్రధాన కార్యదర్శి వీఎస్ రావు తెలిపారు. సమ్మెకు తాము సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని స్పష్టంచేశారు.

# చర్చలకు ఇరాన్ నో

**మొదటిపేజీ తరువాయి**

హార్ముజ్ జలసంధిని దిగ్బంధించడం ద్వారా కాల్పుల విరమణ ఒప్పందాన్ని అమెరికా ఉల్లంఘించిందని ఆరోపించింది. చర్చల నిమిత్తం అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకున్నప్పటికీ ఇరాన్ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదు. తాజా పరిణామాల నేపథ్యంలో కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించే అవకాశాలు కూడా సన్నగిల్లుతున్నాయి. ఇదిలావుండగా పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు ఫోన్ చేసి మధ్యప్రాచ్యంలో నెలకొన్న పరిస్థితిపై చర్చించారు. సౌదీ అరేబియా, ఖతార్, టర్కీ దేశాలతో జరిపిన సంప్రదింపుల వివరాలు తెలియజేశారు.

ప్రతినిధి బృందాన్ని పంపడం లేదు : టెహ్రాన్

చైనాకు టెహ్రాన్ ప్రతినిధి బృందాన్ని పంపుతోందంటూ వస్తున్న వార్తలను ఇరాన్ తోసిపుచ్చింది. అధికారికంగా కానీ, అనధికారికంగా కానీ ఇప్పటి వరకూ ఏ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ బయలుదేరలేదని ప్రభుత్వ మీడియా తెలియజేసింది. రెండో విడత చర్చల కోసం ఇరాన్ ప్రతినిధి బృందం ఇస్లామాబాద్ చేరుకున్నదని లేదా బయలుదేరిందని పలు అంతర్జాతీయ, ప్రాంతీయ వార్తాసంస్థలు కథనాలు అంది స్తుండడంతో ఇరాన్ ఈ వివరణ ఇచ్చింది. ఒత్తిడితో చర్చలు జరపలేమని ఇరాన్ అధికా రులు స్పష్టం చేశారు. అమెరికా వైఖరిలో వచ్చే మార్పును బట్టే చర్చలు కొనసాగుతా యని తేల్చిచెప్పారు. కాగా కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సందర్భంగా ఇచ్చిన హామీ లను అమెరికా ఉల్లంఘిస్తే తమ సాయుధ దళాలు సహించబోవని, అత్యంత అప్రమత్తత తో ఉంటాయని, 'నిర్ణయాత్మకడ తక్షణ' స్పందన తెలుపుతాయని ఇరాన్ సీనియర్ సైనిక కమాండర్ మేజర్ జనరల్ అబ్దోల్లహీ హెచ్చరించారు.

బెదిరింపులతో చర్చలా : ఘలీబఫ్ మండిపాటు

బెదిరింపులు, కాల్పుల విరమణ ఒప్పం దం ఉల్లంఘనల ద్వారా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దౌత్యాన్ని నీరుకారుస్తున్నారని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మహమ్మద్ ఘలీబఫ్ ఆరోపించారు. చర్చలను లొంగుబాటుకు వేదికగా మార్చేందుకు ట్రంప్ ప్రయత్నిస్తు న్నా రని మండిపడ్డారు. ఉద్రిక్తతలు మరింత పెరి గితే యుద్ధభూమిలో మరిన్ని అస్త్రాలు వాడతా మని హెచ్చరించారు. బెదిరింపులకు పాల్పడు తున్న ట్రంప్‌తో చర్చలు ఎలా సాధ్యమని ప్రశ్నిం చారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లం ఘించడమే కాకుండా తమ నౌకల రాకపోక లను అడ్డుకుంటున్నారని ధ్వజ మెత్తారు. లొంగిపోయేలా తమపై ఒత్తిడి తేవడానికి, యుద్ధం తిరిగి మొదలు పెట్టడానికి ఆయన చర్చలను ఓ సాకుగా చూపుతున్నారన్నారు. బెదిరింపుల మధ్య జరిగే చర్చలను ఇరాన్ ఎప్పటికీ అంగీకరించదని చెప్పారు.

చర్చలకు రాకుంటే సమస్యలు తప్పవు : ట్రంప్ బెదిరింపు

'చర్చలకు రండిడలేకుంటే గతంలో ఎన్నడూ చూడని విధంగా సమ స్యలు ఎదుర్కోండి' అని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇరాన్‌ను బెదిరిం చారు. 'ది జాన్ ఫ్రెడరిక్స్ షో'కు ఆయన ఫోన్ ఇంటర్వ్యూ ఇస్తూ చర్చలకు ఇరాన్ వస్తే మంచిదే నని, లేకుంటే గతంలో ఎన్నడూ లేని విధంగా సమస్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని అన్నారు. ఇరాన్ నాయకత్వంతో నేరుగా చర్చలు జరిపేందుకు తాను సిద్ధమేనని ట్రంప్ తెలిపారు. చర్చలు జరిపేందుకు తమ వద్ద సమర్థులైన వ్యక్తులు ఉన్నారని, ఒకవేళ ఇరాన్ ప్రతినిధులు తనను నేరుగా కలవాలని అనుకున్నా అభ్యంతరం లేదని చెప్పారు. ఇదిలావుండగా సామాజిక మాధ్యమ వేదిక ట్రూత్ సోషల్‌లో వరుసగా పోస్టులు పెడు తున్న ట్రంప్ తాజాగా మరో ఆసక్తికరమైన పోస్ట్ పెట్టారు. ఇరాన్‌కు చెందిన వందలాది చమురు నౌకలు అమెరికా వైపు వస్తున్నాయని దాని సారాంశం. అమెరికాకు బయలు దేరాలని ఇరాన్ నాయకత్వమే నౌకలకు సూచించిందని, అవి టెక్సాస్, లూసియానా, అలస్కా నగరాలకు చేరుకునే అవకాశం ఉన్నదని ఆయన రాసుకొచ్చారు. యుద్ధంపై తప్పుడు వార్తలు రాస్తున్నా యంటూ కొన్ని అమెరికా వార్తా సంస్థలపై ట్రంప్ మండిపడ్డారు. అమెరికా సైనిక కార్యకలాపాలు బాగానే కొనసాగుతున్నా యంటూ దళా లను ప్రశం సించారు. ఇరాన్‌తో ఒప్పందం కుదిరే వరకూ నౌకల రాక పోకలపై దిగ్బంధం కొనసాగు తుందని ట్రంప్ చెప్పారు.

శాంతి చర్చలకు సిద్ధంకండి : చైనా సూచన

తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం గడువు బుధవారం ముగుస్తున్న దృష్ట్యా అన్ని పక్షాలు శాంతి చర్చలకు సిద్ధం కావాలని చైనా సూచించింది. 'ప్రస్తుత పరిస్థితి కీలక దశలో ఉంది. అది శాంతి, యుద్ధం మధ్య ఊగిస లాడుతోంది. ఈ తరుణంలో అన్ని పక్షాలు చిత్తశు ద్ధిని ప్రదర్శించాల్సిన అవసరం ఉంది. రాజకీయ పరిష్కారానికి కట్టుబడి ఉండాలి. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పొడిగించి చర్చలు కొనసాగించాలి' అని చైనా విదేశాంగ ప్రతినిధి గుయో జియాకన్ తెలిపారు. హార్ముజ్ జలసంధిని తెరవాలని చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇప్పటికే సూచించారు.

దిగ్బంధాన్ని తప్పించుకొనిడ

హార్ముజ్ జలసంధి వద్ద ఇరాన్ నౌకల రాకపోకలపై అమెరికా దిగ్బంధాన్ని విధించిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఆ ఆంక్షలను దాటుకొని ఇరాన్‌కు చెందిన ఓ ట్యాంకర్ తిరిగి తమ జలాలలో ప్రవేశించిం దని తెలుస్తోంది. ఇరాన్ నుంచి ఇండోనేషియాకు గత నెలలో 20 లక్షల బ్యారళ్ల చమురుతో ఓ నౌక బయలుదేరింది. చమురును మరో ట్యాంకర్‌లోకి బదిలీ చేసిన తర్వాత తిరిగి వెనక్కి బయలు దేరింది. అమెరికా దిగ్బంధాన్ని దాటుకొని విజయవం తంగా ఇరాన్ జలాల్లోకి ప్రవేశించింది. ఇది ఒక గొప్ప విజయమని ఇరాన్ తెలిపింది. అయితే ఈ ఘటనపై అమెరికా ఇంకా స్పందించలేదు.

హార్ముజ్‌ను దాటిన పది భారత నౌకలు

హార్ముజ్ జలసంధిలో నిలిచిపోయిన పది భారత నౌకలు సురక్షితంగా దానిని దాటా యి. భారత నౌకలు హార్ముజ్‌ను దాటి బయటికి వచ్చేందుకు వీలు కల్పించా లంటూ ఇరాన్ అధికారులతో చర్చలు జరుపుతున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. హార్ముజ్‌ను దాటేందుకు ప్రయత్నించిన రెండు భారత నౌకలపై ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత విదేశాంగ శాఖ అప్రమత్తమైంది. 'ఇరాన్ రాయబారిని పిలిపించాం. విదేశాంగ కార్యదర్శితో ఆయన సమావేశమయ్యారు. దాడి గురించి తమ అధికారులకు తెలియజేస్తానని రాయబారి చెప్పారు' అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ విలేకరులకు చెప్పారు. కాగా మన దేశానికి చెందిన మరో 14 నౌకలు ఇంకా హార్ముజ్‌లోనే ఉన్నాయి.

# కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి?

**మొదటిపేజీ తరువాయి**

ఫిరాయింపుల కేసుల కోసం సీనియర్ న్యాయవాదులను సంప్రదించడానికే ఢిల్లీకి వెళ్లామన్నారు. కాంగ్రెస్ బీఫామ్‌పై ఎంపీగా పోటీ చేసి కూడా ఆయన ఇంకా బీఆర్ఎస్‌లోనే ఉన్నానంటూ ఒక ఎమ్మెల్యే అనడం, దాన్ని స్పీకర్ ధ్రువీకరించడం అత్యంత దుర్మార్గమని విమర్శించారు.

బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు సుప్రీంకోర్టులో ఓటుకు నోటు కేసు విచారణకు వస్తుందన్నారు. పట్టపగలు బ్యాగులతో దొరికిపోయిన దొంగ రేవంత్ రెడ్డి అనీ, ఇప్పుడు హోంమంత్రిగా ఆయనే ఉన్నారని చెప్పారు. ప్రభుత్వం తరపున నామమాత్రపు న్యాయవాదులను పెట్టి, వ్యక్తిగతంగా ఆయన తరఫున ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూద్రా వంటి ఖరీదైన న్యాయవాదులను పెట్టుకున్నారని వివరించారు. ఈ ఓటుకు నోటు కేసులో బీఆర్ఎస్ తరఫున జగదీశ్‌రెడ్డి, సంజరు, సత్యవతి రాథోడ్, మహమూద్ అలీ ఇంప్లీడ్ అయ్యారని అన్నారు. నాడు సమైక్య వాదులతో చేతులు కలిపి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని కుట్ర చేసింది రేవంత్‌రెడ్డి కాదా? అని ప్రశ్నించారు. నాలుగున్నరేండ్ల నుంచి స్టేల మీద బతుకుతున్న రేవంత్ రెడ్డికి ఆ స్టే వెకేట్ అయిందంటే ముఖ్యమంత్రి సీటు ఊడటం, ఆయన జైలుకు వెళ్లడం ఖాయమని చెప్పారు. కేసీఆర్ 'స్టేట్స్ మన్' లాగా రాష్ట్ర ప్రయోజనాల కోసం మాట్లాడితే రేవంత్‌రెడ్డి ఆయన కుర్చీ కోసం 'స్ట్రీట్ మన్' లాగా మాట్లాడారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సభకు పోటీగా అదే సమయానికి మైకు పట్టుకుని రేవంత్‌రెడ్డి సంకుచిత బుద్ధిని బయటపెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ వస్తున్నారని భయపడి డైవర్షన్ కోసం ఒక కిస్తీ రైతు భరోసా వేశారని చెప్పారు. రేవంత్‌రెడ్డి తలకిందులుగా తపస్సు చేసినా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందనీ, రూ.లక్ష కోట్లు కొట్టుకుపోయాయని నిన్నటిదాకా రేవంత్‌రెడ్డి దుష్ప్రచారం చేశారని చెప్పారు. ఇప్పుడు మేడిగడ్డ రిపేరు చేసుకుని వాడుకుంటామని ఒప్పుకున్నారనీ, రెండు పిల్లర్లు కుంగితే మొత్తం ప్రాజెక్టు కొట్టుకుపోయినట్టా?అని ప్రశ్నించారు. ఎన్ని డ్రామాలు ఆడినా రేవంత్‌రెడ్డికి నూకలు చెల్లాయనీ, మళ్లీ ముఖ్యమంత్రి అయ్యే పరిస్థితి లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే కెపి వివేకానంద, మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, కార్పొరేషన్ల మాజీ చైర్మెన్లు జి దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
బుధవారం 22 ఏప్రిల్ 2026

# ప్రభుత్వ ఆసుపత్రి కార్మికుల కనీస వేతనం 26 వేలకు పెంచకపోతే సమ్మె తప్పదు

**ప్రజావినికిడి, (హిమాయత్ నగర్):**
తెలంగాణ రాష్ట్రంలో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేలాదిమంది సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాల జీవోలు సవరించి కనీస వేతనాలు పెంచాలని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన బోర్డు తీర్మానించి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేసి ఏడాది గడుస్తున్న పట్టించుకోకపోవడం దుర్మార్గమని తెలంగాణ రాష్ట్ర కనీస వేతన బోర్డు సభ్యులు, ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి. యూసుఫ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రభుత్వ మెడికల్ కళాశాలలు,జిల్లా ఏరియా సామాజిక ఆరోగ్య కేంద్రాలలో పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ సూపర్వైజర్ కాంట్రాక్టు కార్మికులకు 26వేల వేతనం పెంచాలని, ఏజెన్సీల విధానం రద్దుచేసి కార్పొరేషన్ ద్వారా వేతనాలు అందించాలని, జాతీయ,పండగ,
ఆర్జిత సెలవులు ఇవ్వాలని,ఒక నెల వేతనం ఆస్పత్రి కార్మికులకు బోనస్ చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకై తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ నేతృత్వంలో మంగళవారం కోఠి లోని డిఎంఈ,టీవీవీపి కార్యాలయాలను ప్రభుత్వ




ఆసుపత్రుల పారిశుధ్య సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా వందలాది మంది తరలివచ్చి భగభగ మండే ఎర్రటి ఎండలో గంటల తరబడి ఆందోళన కొనసాగించి ముట్టడించారు. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని ఏఐటియుసి మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలను కార్మికులను కొద్దిమందిని అనుమతి ఇచ్చి డిఎంఈ డాక్టర్ నరేంద్ర కుమార్ టీవీవిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎం.డి.యూసుఫ్ మాట్లాడుతూ,
కనీస వేతనాల జీవోలు సవరణకు నోచుకోక దాదాపు పుష్కరకాలం గడిచిపోయిందని దీని ఫలితంగా వేలాది మంది కార్మికులు తీవ్రమైన ఆర్థిక దోపిడీకి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కనీస వేతన బోర్డు సభ్యులు ప్రభుత్వాన్ని చేసిన సిఫారసులు పరిశీలించి అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముగ్గురు మంత్రులతో త్రిషభ్య కమిటీని ఏర్పాటు చేశారని ఇప్పటివరకు ఆ త్రిసభ్య కమిటీ ఒకసారి కూడా సమావేశం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులకు ఎలాంటి కార్మిక చట్టాలు అమలు కావడం లేదని ప్రభుత్వ ఉదాసీనత వైఖరి కారణంగా ఏజెన్సీ నిర్వాహకులు ఆగడాలు పెరిగిపోయాయని, కార్మికులకు సరైన వేతనాలు చెల్లించకుండా కార్మికులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ,ప్రభుత్వ ఆసుపత్రుల పారిశుధ్య సెక్యూరిటీ పేషంట్ కేర్ సూపర్వైజర్ సర్వీసెస్ కోసం ప్రభుత్వం ఐహెచ్ఎఫ్ఎంఎస్ నోటిఫికేషన్ ద్వారా మూడు సంవత్సరాల కాల వ్యవధితో ఏజెన్సీలను ఎంపిక చేసే విధానం కొనసాగుతున్నదని ప్రస్తుత ఏజెన్సీల కాల పరిమిత ముగిసి ఏడాది అవుతున్న ఇప్పటికీ ప్రభుత్వం వైద్యశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ ప్రస్తుత ఏజెన్సులకే గడువులు పెంచుతూ అనుమతులు ఇస్తున్నారని ధ్వజమెత్తారు. జీవో నెంబర్ 60 ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు వేతనాలు అందిస్తున్నామని చెబుతున్న లోప భూయిష్ట అమలు విధానంతో కార్మికులు గత నాలుగు సంవత్సరాలుగా కార్మికుల కష్టం కాంట్రాక్టర్ల జేబులోకి వెళుతుందని అన్నారు. ఆసుపత్రుల కార్మికులకు వేతనాలు పెంచాలని విధులకు ఎలాంటి ఆటంకాలు కలగకుండానే అనేక రూపాల్లో ఆందోళనలు అధికారులకు విన్నపాలు చేసిన పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రి కార్మికులకు 26వేల కనీస వేతనం పెంచకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. వేతనాల పెంపు పోరులో కార్మికుల పెద్ద ఎత్తున కలిసి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏం లక్ష్మీబాయి, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ హసీనా బేగం,రాష్ట్ర కార్యదర్శిలు వై ఓమయ్య, పి.సురేష్, ఎ.పార్వతి,సిర్రా దేవేందర్,ఎస్ కిష్టమ్మ, ఏఐటీయూసీ నాయకులు రెహమాన్, శ్రీనివాసులు, బొడ్డుపల్లి కిషన్, మదన్ సింగ్,పి. వరలక్ష్మి,కృష్ణవేణి,తదితరులు పాల్గొన్నారు.

# వాటర్ & అమ్యూజ్‌మెంట్ థీమ్ పార్క్ ప్రారంభం

**శంకర్‌పల్లి,(ప్రజావినికిడి):**
కృష్ణ సందీప్ కిలారు,స్వాతి కిలారు స్థాపించిన వైల్డ్ వాటర్స్,గత 9 సంవత్సరాలుగా ప్రతి సీజన్‌లో కొత్త వినోదాలను పరిచయం చేస్తూ హైదరాబాద్‌లో ప్రముఖ ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్ కేంద్రంగా ఎదిగింది. హైదరాబాద్‌కు సమీపంలోని ప్రముఖ వాటర్ & అమ్యూజ్‌మెంట్ థీమ్ పార్క్ వైల్డ్ వాటర్స్ భారతదేశంలో తొలిసారిగా వాటర్ & అమ్యూజ్‌మెంట్ పార్క్‌లో ఇమర్సివ్ 360ళీ డోమ్ ప్రారంభించారు.
ఈ వినూత్న ఆకర్షణను ప్రముఖ సినీ నటి ఫారియా అబ్దుల్లా ప్రారంభించారు. ఏప్రిల్ 18 నుండి జూన్ 14 వరకు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా నటి ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ,
శంకర్‌పల్లిలోని వైల్డ్ వాటర్స్‌లో




ఇమర్సివ్ 360 డోమ్‌ను ప్రారంభించడానికి ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. ఈ సాయంత్రం నాకు చాలా స్పెషల్. ఈ 360 డోమ్ ఎక్స్పీరియన్స్ అద్భుతంగా ఉంది. ఇలాంటి స్పెషల్ ఎక్స్పీరియన్స్ నేను ఇండియా బయట చూసాను. హైదరాబాద్‌లో ఈ తరహా ప్రత్యేక ఆకర్షణ మొదటిసారిగా రావడం చాలా సంతోషంగా ఉంది. మీరు తప్పకుండా ఈ అనుభవాన్ని పొందాలి. ఇక్కడ 50కి పైగా రైడ్స్ ఉన్నాయి, మీకు అద్భుతమైన అనుభవం కలుగుతుంది. నేను జెయింట్ వీల్ ట్రై చేసాను, ఆ అనుభవం చాలా థ్రిల్లింగ్‌గా ఉంది. ఇలాంటి మంచి వాళ్ళతో కలవడం చాలా ఆనందంగా ఉంది. మళ్లీ నా స్నేహితులతో ఇక్కడికి రావాలని అనుకుంటున్నానుమీరు కూడా మీ కుటుంబం, స్నేహితులతో వస్తే మరింత ఆనందిస్తారు. ఆల్ ది బెస్ట్ అన్నారు.
ఇమర్సివ్ 360ళీ డోమ్ ప్రత్యేకత ఏమిటంటే గోడలు,పైకప్పు మొత్తం ఒకే స్క్రీన్‌లా మారి, సరౌండ్ సౌండ్‌తో కలిసి సందర్శకులకు పూర్తి స్థాయి ఇమర్సివ్ సినీ అనుభవాన్ని అందిస్తుంది. చుట్టూ కనిపించే విజువల్స్ వల్ల ప్రేక్షకులు నిజంగా ఆ సన్నివేశాల్లో ఉన్నట్లు అనుభూతి చెందుతారు. రోజంతా విభిన్న థీమ్‌లతో షోలు ప్రదర్శించబడతాయి.
అందరూ వచ్చి వైల్డ్ వాటర్స్ అద్భుతమైన సమయాన్ని గడపాలని కోరారు.

# అవసరాన్ని బట్టి ఫ్లై ఓవర్ నిర్మిస్తాం

## ప్రజలు ఆందోళన చెందవద్దు

**అవసరం ఉన్న చోట ఫ్లై ఓవర్ నిర్మించండి,అవసరం లేని చోట ఫ్లైఓవర్ నిర్మాణం అవసరం లేదు..**

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి**




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**మంగళవారం రోజు చంపాపేట్ డివిజన్ పరిధిలోని ఓవైసీ నుంచి కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం వెళ్లే ప్రధాన రహదారిపై నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు మాట్లాడుతూ,ఇట్టి ప్రభుత్వం టీ.కె.ఆర్.కమాన్ చౌరస్తా నుండి ఓవైసి చౌరస్తా వరకు ఆరు లైన్ల విస్తరణ పేరిట దాదాపు 240 మందికి నోటీసులు ఇవ్వడం జరిగింది. నూతన ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల ఎన్నో ఏండ్ల నుండి నివాసం ఉంటున్న మేము ఎక్కడికి పోవాలి అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉన్న వసతులు మా ఏరియాలో 150 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు అందుబాటులో ఉందని తెలిపారు. కానీ మళ్ళీ ఇప్పుడు 25 ఫీట్ల మేరకు రోడ్డు విస్తరణ పేరిట మా ఇల్లు కూలగొట్టడం జరుగుతుంది అని తెలపడం ఎంతవరకు సబాబు అని అన్నారు. జీవితాంతం కష్టపడి కట్టుకున్న ఇల్లు కోల్పోవడం వల్ల మేము రోడ్డు మీద పడే పరిస్థితి ఏర్పడింది కావున ఇట్టి నూతన ఫ్లైఓవర్ ప్రతిపాదనలు విరమించుకోవాలని కోరారు. అనంతరం సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఇక్కడ ఉన్న 150 ఫీట్ల ఇన్నర్ రింగ్ రోడ్డు వల్ల భవిష్యత్తులో దాదాపు మరో 25 సంవత్సరాల వరకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు ఉండవని తెలిపారు. ఇక్కడ ఫ్లైఓవర్ అవసరం లేదని అన్నారు. గతంలో నేను బండ్లగూడ ఆనంద నగర్ చౌరస్తా అదేవిదంగా హస్తినాపురం చౌరస్తా వద్ద నూతన ఫ్లైఓవర్ మంజూరు చేయాలని కోరడం జరిగింది. అక్కడ ప్రతినిత్యం ఉదయం అలాగే సాయంత్రం తీవ్ర ట్రాఫిక్ సమస్యలు ఉంటాయని తెలిపారు. కానీ అక్కడ మంజూరు చేయకుండా ఇక్కడ మంజూరు చేయడం హాస్యాస్పదం అని అన్నారు. ఈ నూతన ఫ్లైఓవర్ విషయంలో ప్రభుత్వం దృష్టికి పెద్దఎత్తున తీసుకెళ్లి విరమింపచేసే ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారస నాయకులు రాజిరెడ్డి,ముద్ద కళ్యాణ్,చలమల యాదిరెడ్డి,రవి ముదిరాజ్,ప్రభాకర్,కనకేష్,జంగయ్య,చందు,శ్రీనివాస్, రమాదేవి కాలనీవాసులు జగదీశ్,నవరత్నం,నర్సింహా,సురేష్,శ్యామ్,శ్రీనివాస్ సాగర్,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు తమకు కేటాయించిన ఇండ్లలో తప్పకుండ నివసించాలి..

**2 బిహెచ్‌కే ఇండ్లు తీసుకున్న ఇంకా వాటిల్లో నివసించని వారికి**

**కేటాయించిన ఇండ్లను నోటీస్ ఇచ్చి(రద్దు)చేయండి :జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి.**

**రంగారెడ్డి,(ప్రజా వినికిడి):**
రంగారెడ్డి జిల్లాలో ఎంపిక చేసిన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇండ్లను కేటాయించాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయము నుండి హౌసింగ్ అధికారులు,ఆర్డీఓలు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు,సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,
జిల్లాలో పూర్తి అయిన,నిర్మాణ దశలో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించుటకు ఎంపిక చేసిన లబ్దిదారులకు కేటాయించాలని తెలిపారు. సంబంధిత ఆర్డీఓలు, డిప్యూటీ కమిషనర్లు ఇందిరమ్మ కమిటీల ద్వారా ఎల్2 లిస్ట్ నుండి పేదవారిని ఎంపిక చేయాలని సూచించారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు పొందిన లబ్దిదారులు వాటిలో నివాసం ఉండని




లబ్దిదారులందరు వెంటనే తమకు కేటాయించిన ఇండ్లలో నివసించాలని,
ఏమైనా ఇబ్బందులు తెలియజేయాలని, లేని యెడల వారికి కేటాయించిన ఇండ్లను(రద్దు)చేసి కొత్త వారికి కేటాయించడం జరుగుతుందని తెలిపారు. సంబంధిత అధికారులందరూ పూర్తి బాధ్యతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాన్ని సమన్వయంతో సమిష్టిగా పని చేసి గడువులోగా పూర్తి చేయాలని



సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) కె.శ్రీనివాస్,జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ డి.చాంప్లా నాయక్, ఆర్డీఓలు,తహసీల్దార్లు,మున్సిపల్ కమిషనర్లు, హౌసింగ్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు,సంబంధిత అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

# అబద్దాలు చెప్పడంలో కెసిఆర్ దిట్ట

## మోటర్లకు మీటర్లపై మండిపడ్డ ఎంపి అర్వింద్



**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ం వ్యవసాయ మోటర్లకు కరెంట్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. సోమవారం జగిత్యాల సభలో కేసీఆర్ చెప్పినవన్నీ కేంద్రం నిధులతో చేసినవేనని చెప్పారు. కేసీఆర్.. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిల చెల్లింపులు చేయలేదు. భూముల ధరలు దేశవ్యాప్తంగా పెరిగాయని భాజపా ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. 72 ఏళ్ల వయసులోనూ కేసీఆర్ పచ్చి అబద్దాలు మాట్లాడారని విమర్శించారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన హయాంలోనే సివిల్ సప్లయ్‌లో అక్రమాలు ప్రారంభమయ్యాయి. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆనాటి నుంచి కేసీఆర్ కోవర్టు. ఆయన పేరుకే కాంగ్రెస్.. నిజానికి బీఆర్ఎస్ కార్యకర్త అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సివిల్ సప్లయ్‌లో అక్రమాలను ఉత్తమ్ కొనసాగిస్తున్నారు. కేంద్రం తీసుకొచ్చిన బిల్లులో కరెంట్ మీటర్ అనేది లేనేలేదు. రైతుల వద్ద కరెంట్ బిల్లు వసూలు చేయాలని కేంద్రం ఎక్కడా చెప్పలేదు. ఆదివాసీలకు పోడు భూములకు పట్టాలు ఇస్తానని కేసీఆర్ హామీ ఇచ్చారు. ఆదిలాబాద్‌లో పోడు భూముల పట్టాలు అడిగిన మహిళలపై దౌర్జన్యాలు చేయించారు. తెలంగాణలో రైతులను ఆదుకోలేదు కానీ, పంజాబ్‌కు వెళ్లి చెక్కులు ఇచ్చి వచ్చారని అర్వింద్ విమర్శించారు.

# మహిళా బిల్లు వీగడానికి కాంగ్రెస్ కారణం -రాహుల్ తీరుపై మండిపడ్డ ఎంపి అరుణ

**మహబూబ్‌నగర్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ం లోక్‌సభలో ఇటీవలే మహిళల రిజర్వేషన్ బిల్లు వీగిపోవడానికి కాంగ్రెస్ ప్రధాన ముద్దాయి అని మాజీ మంత్రి, బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. విపక్షాలతో కలసి మహిళా బిల్లును అడ్డుకుని సాధించేదేంటని అన్నారు. బిల్లు వీగిపోవడంతో అధికార ఎన్డీయే పార్టీలు.. ప్రతిపక్షాలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నాయి. ప్రతిపక్ష పార్టీలకు మహిళలు అంటే చిన్నచూపని, చట్టసభల్లోకి మహిళలు రావడం అంటే ఇష్టం లేదంటూ ఎన్డీయే పార్టీల నేతలు ఆరోపిస్తున్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వకుండా విపక్షాలు కుట్రపూరితంగా అడ్డుకున్నాయని ఎంపీ డీకే అరుణ తెలిపారు. దేశాన్ని ఉత్తర, దక్షిణ భారతదేశం పేరుతో విడగొట్టే చర్యలకు పూనుకుంటున్నాయని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు.



రాహుల్ గాంధీ పార్లమెంటులో హుందాగా వ్యవహరించలేదని, మహిళా రిజర్వేషన్ వల్ల ప్రధాని మోదీకి మంచి పేరు వస్తుందనే అడ్డుకున్నారంటూ ఎంపీ అరుణ మండిపడ్డారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది. మహిళలను అవమానపరిచిన కాంగ్రెస్ పార్టీకి సమయం వచ్చినప్పుడు బుద్ధిచెప్పాలి. జీడీపీ ప్రకారం డీలిమిటేషన్ చేయాలంటున్న సీఎం రేవంత్ రెడ్డి.. హైదరాబాద్‌లో అధికంగా సీట్లు పెరగాలనే ఉద్దేశమా అని అన్నారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనేది కేవలం అపోహనే అన్నారు. ఈనెల 24న గవర్నర్ శివప్రతాప్ శుక్లా మహబూబ్ నగర్‌లో పర్యటించనున్నారు. 'ప్రధానమంత్రి సంసద్ ఖేల్ మహోత్సవ్'లో గెలుపొందిన క్రీడాకారులకు గవర్నర్ బహుమతులు ప్రదానం చేస్తారు' అని ఎంపీ అరుణ వెల్లడించారు. ఆయన పర్యటనకు ప్రజలు హాజరు కావాలన్నారు.

# ఎంపిటిసి, జడ్పిటిసిలకు సిద్ధం కండి

## కాంగ్రెస్ కార్యకర్తలకు దామోదర సూచన



**సంగారెడ్డి,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని పార్టీ నేతలకు మంత్రి దామోదర రాజనర్సింహ పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో కాంగ్రెస్ పార్టీ జిల్లా పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశానికి మంత్రి దామోదర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నాయకుల్లో వర్గపోరు ఉంటే పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పదవిని అనుభవించాలని మంత్రి అన్నారు. వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గాల పునర్విభజన ఉన్నా లేకున్నా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజలే బలమని.. కార్యకర్తలే ధైర్యం, స్థైర్యమని స్పష్టం చేశారు. ప్రస్తుత రాజకీయాల్లో సిద్ధాంతాలు, విశ్వాసం తక్కువని... అవకాశవాదం ఎక్కువన్నారు. ఎప్పుడూ శత్రువుని తక్కువ అంచనా వేయకూడదని సూచించారు. 70 వేల ఉద్యోగాలను ప్రభుత్వం ఇప్పటికే భర్తీ చేసిందని వెల్లడించారు. ఆరోగ్య శాఖలో ఇంకో 3 నెలల్లో మొత్తం 20 వేల ఉద్యోగాలు భర్తీ చేస్తామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇస్తున్న సన్నబియ్యం పథకం దేశంలో ఎక్కడా లేదని దామోదర రాజనర్సింహ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డులు పంపిణీ చేస్తామని చెప్పారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని అన్నారు. 200 కోట్ల రూపాయల అభివృద్ధి పనులతో సింగూరు ప్రాజెక్ట్‌ను టూరిజం స్పాట్‌గా మారుస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు నిర్మలా జగ్గారెడ్డి, నీలం మధు, కాట శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.

---------

# పెట్రోల్ బంక్ దగ్గర అగ్నిప్రమాదం

## లారీలో చెలరేగిన మంటలు

**గోదావరిఖని,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ంగోదావరిఖనిలో అగ్నిప్రమాదం జరిగింది.. పెట్రోల్ బంక్ దగ్గర ఆగి ఉన్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మంగళవారం (జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి..గోదావరిఖనిలోని గంగా నగర్ పెట్రోల్ బంక్ దగ్గర అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. గత కొన్నిరోజులుగా పెట్రోల్ బంక్ దగ్గర ఆగి ఉన్న లారీలో మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగిసి పడటంతో విద్యుత్ తీగలకు కూడా మంటలు వ్యాపించాయి. లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగడం, పక్కనే పెట్రోల్ బంక్ కూడా ఉండటంతో భయాందోళనకు గురయ్యారు స్థానికులు. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలానికి చేరుకున్న ÷ర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు.్గ ÷ర్ సిబ్బంది సకాలంలో స్పందించడంతో పెను ప్రమాదం తప్పిందని అంటున్నారు స్థానికులు. ఈ ఘటనలో ప్రాణనష్టమేమీ జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు పోలీసులు. ఆగి ఉన్న లారీకి సంబంధించిన వివరాలు, ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు పోలీసులు.

------

# నటుడు ప్రకాశ్‌రాజ్ వ్యాఖ్యలు

## పంజాగుట్ట స్టేషన్‌లో నటి కరాటే కళ్యాణి ఫిర్యాదు

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ంనటుడు ప్రకాష్ రాజ్ పవిత్రమైన రామాయణంపై చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారం రేపుతున్నాయి. ప్రకాష్ రాజ్ చేసిన వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీశాయని ఆరోపిస్తూ నటి, బీజేపీ నాయకురాలు కరాటే కళ్యాణి హైదరాబాద్ లోని పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇటీవల కోజికోడ్‌లో జరిగిన కేరళ లిటరేచర్ ఫెస్టివల్‌లో ప్రకాష్ రాజ్ ప్రసంగిస్తూ.. రామాయణాన్ని వింతగా విశ్లేషించారు. ఒక చిన్నారుల నాటకాన్ని ఉటంకిస్తూ.. శ్రీరాముడు, లక్ష్మణుడు ఉత్తరాది నుండి వచ్చిన వలస కూలీలని, వారు దక్షిణాదికి వచ్చి రావణుడి తోటలో పండ్లు దొంగిలించారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, దీనికి జీఎస్టీ ని ముడిపెడుతూ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా అవుతున్నాయి. పవిత్ర ఇతిహాసాన్ని వక్రీకరించి, మతపరమైన సామరస్యాన్ని దెబ్బతీసేలా ఆయన ప్రసంగం ఉందని కళ్యాణి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. కరాటే కళ్యాణి పంజాగుట్ట ఇన్‌స్పెక్టర్ ఎం. రామకృష్ణను కలిసి ఫిర్యాదును అందజేశారు. ప్రకాష్ రాజ్‌పై భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్ 196 , 299 , 353 , ఐటీ చట్టం సెక్షన్ 67 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆమె కోరారు. రామాయణం అనేది కోట్ల మంది భారతీయుల విశ్వాసం. దానిని వక్రీకరించి మాట్లాడటం దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. వివాదాస్పద వీడియోలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ, సాక్ష్యాధారాలను పోలీసులకు సమర్పించారు. మత విశ్వాసాలను అవమానించేలా, మతాల మధ్య విద్వేషాలు పెంచేలా ఆయన వ్యాఖ్యలు ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

-----

# రీల్స్ మోజులో బిల్డింగ్‌పై నుంచి పడ్డ బాలుడు

## చికిత్స పొందుతూ మృతి



**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** గంటలు తరబడి రీల్స్ స్క్రోల్ చేస్తూ టైం వేస్ట్ చేసేవారు కొందరైతే... రీల్స్ కోసం రిస్క్ చేసి ప్రాణాల మీదకు తెచుకునేవారు మరికొందరు. రీల్స్ కోసం రిస్క్ చేసి మరో బాలుడు ప్రాణాలు వదిలాడు.హైదరాబాద్ లో దారుణం జరిగింది. సోషల్ మీడియాలో రీల్స్ చేస్తూ బిల్డింగ్ పై నుంచి జారిపడి బాలుడు మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... హైదరాబాద్ లోని నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ గాంధీ బొమ్మ బస్తీకి చెందిన 14 ఏళ్ళ బాలుడు మితున్ రీల్స్ చేస్తూ బిల్డింగ్ పైనుంచి పడి మృతి చెందాడు. ఏప్రిల్ 5న జరిగిన ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ మిథున్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రెండు రోజుల క్రితం మృతి చెందాడు. మితున్ బిల్డింగ్ మీద నుంచి కిందపడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. బాలుడి మృతదేహాన్ని బీహార్ కు తరలిస్తున్నారు బంధువులు. మితున్ మృతితో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రజలు సమస్యల్లో ఉంటే సభలతో కాలయాపనా



**ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి**

**ప్రైవేట్ పరం చేసే యత్నాలను అడ్డుకుంటాం**

**25న రాజకీయ శక్తిగా ముందుకు రాబోతున్నాం**

**జాగృతి అధ్యక్షురాలు కవిత వెల్లడి**

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జాగృతి అధ్యక్షురాలు కవిత డిమాండ్ చేశారు. ఆర్‌టిసి కార్మికులంటే లెక్కలేనితనంతో ప్రభుత్వం వ్యవహరిస్తోందని కవిత మండిపడ్డారు. ఆర్‌టిసిలో కార్మికులు లేకుండా చేసి సంస్థను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నారని ఆరోపించారు. ఆర్‌టిసి కార్మికుల సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. సమ్మెకు దిగిన ఆర్టిజన్లను బెదిరించి విధుల్లో చేరేలా ఒత్తిడి చేశారని అన్నారు. ప్రజలందరూ సమస్యల్లో ఉంటే అధికార, ప్రతిపక్షాలు రాజకీయాలు చేయడానికే ప్రాధాన్యత ఇస్తున్నాయని మండిపడ్డారు. కార్మికులంటే ఈ ప్రభుత్వానికి లెక్కలేదని అన్నారు. ఆర్‌టిసిని ప్రైవేటుపరం చేసే కుట్రలను అడ్డుకుంటామని హెచ్చరించారు. వెంటనే ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ప్రభుత్వం, ప్రతిపక్షం సభలు పెట్టాయంటూ మండిపడ్డారు. ప్రతిపక్షం ఉట్టికథలు చెబితే.. ప్రభుత్వం పిట్టకథలు చెప్పిందంటూ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సభలో బీజేపీపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల గురించి ఎందుకు మాట్లాడలేదని జాగృతి అధ్యక్షురాలు నిలదీశారు. వెయ్యి ఏళ్ళైనా బీఆర్ఎస్ మారదని కవిత వ్యాఖ్యానించారు. గుంటనక్క నిన్న ఢిల్లీ వెళ్లి ఆర్ఎస్ఎస్ పెద్దలను కలిసిందన్నారు. ప్రాజెక్ట్‌ల్లో అవినీతి నుంచి బయటపడేందుకు ఆర్ఎస్ఎస్‌తో చర్చలు జరిపారంటూ కవిత ఆరోపించారు. ఈనెల 25న తెలంగాణ రాజకీయాల్లోకి నూతన రాజకీయ శక్తిగా వస్తున్నామని, ప్రజలందరికీ ఈ వేదిక నుంచి ఆహ్వానం పలుకుతు న్నామని చెప్పారు. పార్టీ ఆవిర్భావ సభకు సిరిసిల్ల నుంచి పార్టీ కార్యకర్తలు మంగళవారం పాదయాత్రగా బయలుదేరారని తెలిపారు. తమ పార్టీ ఆవిర్భావ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చే క్యాడర్ వాహనాలకు ఎలాంటి ఎలాంటి ఇబ్బంది కలిగించొద్దని పోలీసులు, అధికార యంత్రాంగాన్ని కోరారు.

# తమిళనాడు ప్రచారంలో ఖర్గే వివాదదాస్పద వ్యాఖ్యలు

**మోడీని టెర్రరిస్ట్ అంటూ ఎత్తిపొడుపు**

**ఖర్గే వ్యాఖ్యలపై మండిపడ్డ బిజెపి నేతలు**

**అలా అనలేని మళ్లీ వివరణ ఇచ్చిన ఖర్గే**



**చెన్నై,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వివాదంలో చిక్కుకున్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం చెన్నైలో మాట్లాడుతూ.. ప్రధాని మోదీని ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. దాంతో ఆయన క్షమాపణలు చెప్పాలంటూ భాజపా డిమాండ్ చేసింది అన్నాడీఎంకే-భాజపా పొత్తును ప్రశ్నించిన ఖర్గే.. ఆ పార్టీ మోదీతో ఎలా చేతులు కలిపిందన్నారు.

ఈ సందర్భంగా ప్రధానమంత్రిని 'టెర్రరిస్టు'గా అభివర్ణించారు. ఆయనకు సమానత్వం, న్యాయంపై నమ్మకం లేవన్నారు. అలాంటి వాళ్లతో అన్నాడీఎంకే కలవడమంటే ప్రజాస్వామ్యాన్ని బలహీనపరచడమే నని విమర్శించారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల ప్రచారం చివరిరోజైన మంగళవారంనాడు ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. కాగా, ప్రచార సభలో చేసిన టెర్రరిస్టు వ్యాఖ్యలపై ఖర్గే వివరణ ఇచ్చారు. బీజేపీ ప్రభుత్వం రాజకీయ పార్టీలను, అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేస్తోందని, సీబీఐ, ఈడీ, ఆదాయం పన్ను శాఖ వంటి సంస్థలను దుర్వినియోగం చేస్తోందని అన్నారు. ఆ సందర్భంలోనే తాను మాట్లాడానని, మోదీని టెర్రరిస్టు అని తాను అనలేదని చెప్పారు. ప్రభుత్వం దర్యాప్తు సంస్థలతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోందని చెప్పడమే తన ఉద్దేశమని వివరించారు. కాంగ్రెస్, డీఎంకే కూటమి సాగించిన ప్రచారంపై మీడియా అడిగినప్పుడు, చాలాబాగా జరిగిందని, అన్ని చోట్ల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం తమ కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఖర్గే సమాధానమిచ్చారు. రాహుల్ గాంధీ, స్టాలిన్ ఒకే వేదిక నుంచి ప్రచారం సాగించకపోవడంపై అడిగినప్పుడు, ఆ విధంగా చూడకూడదని, ప్రతి ఒక్కరూ ప్లానింగ్ ప్రకారమే ప్రచారం చేస్తుంటారని చెప్పారు. 'నేను ఒకచోట నుంచి ప్రచారం చేస్తే, రాహుల్ మరో చోట ఉంటారు. ఎవరు ఎక్కడ ప్రచారం చేసినా సమష్టి ఆలోచనతోనే ప్రచారం సాగుతుంది. అంతా కలిసికట్టుగా పోరాటం సాగించాం. మేము గెలుస్తాం' అని ఖర్గే సమాధానమిచ్చారు. మోదీని ఉద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై భాజపా తీవ్రంగా స్పందించింది. ఈ అవమానకర వ్యాఖ్యలపై ఖర్గే, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేసింది. ఈ వివాదంపై కాంగ్రెస్ అధ్యక్షుడు స్పందించారు. తాను ఎప్పుడూ మోదీని ఉగ్రవాది అని అనలేదన్నారు. ప్రజలు, రాజకీయ పార్టీలను ఆయన భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పడమే తన ఉద్దేశమని వివరణ ఇచ్చారు. ప్రధాని మోదీపై ఖర్గే చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర ఖండించారు. కాంగ్రెస్ పార్టీ మైండ్‌సెట్‌కు ఆయన చేసిన వ్యాఖ్యలు అద్దంపడతాయన్నారు. ఆయన నోరుజారి ఈ వ్యాఖ్యలు చేయలేదని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని అన్నారు. రాహుల్ గాంధీ ప్రతిరోజూ తన ప్రసంగాల్లో ప్రధానిని నిందిస్తుంటారని, ఈరోజు రాహుల్ తరపున మల్లికార్జున్ ఖర్గే ఆపని చేశారని అన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ ఒసామా బిన్ లాడెన్‌ను ఒసామాజీ అని, జకీర్ నాయక్‌ను శాంతిదూత అని సంబోధిస్తుంటుందని ఎద్దేవా చేశారు. ప్రధానిని కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు నిందించినా ప్రజలు శిక్షిస్తూనే వచ్చారని, ఈసారి కూడా ప్రజలు గట్టి సమాధానం ఇస్తారని అన్నారు.

# ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా మంచిర్యాల

**ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగలకు రాష్ట్ర ప్రజలు అల్లాడిపోతున్నారు. ఎండల తీవ్రత ఏ స్థాయిలో ఉందంటే, మంచిర్యాల ప్రపంచంలోనే అత్యంత వేడి నగరాల్లో ఒకటిగా నిలిచింది. అమెరికాకు చెందిన ప్రముఖ వాతావరణ సంస్థ 'ఎల్డోరాడో వెదర్' తాజాగా రూపొందించిన ప్రపంచంలోని 100 అత్యంత వేడి నగరాల జాబితాలో మంచిర్యాల 14వ స్థానంలో నిలవడం గమనార్హం.

సోమవారం (ఏప్రిల్ 20) మంచిర్యాలలో 43.4 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎల్డోరాడో వెదర్ జాబితాలో మహారాష్ట్రలోని అకోలా 45 డిగ్రీలతో అగ్రస్థానంలో ఉంది. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను పరిశీలిస్తే.. కొత్తగూడెం, గద్వాలలో 43.3, నిర్మల్, నిజామాబాద్‌లలో 43.0 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రాంతంలో ఎండలు ఇంత తీవ్రంగా ఉండటానికి భౌగోళిక కారణాలతో పాటు అటవీ విస్తీర్ణం తగ్గడమే ప్రధాన కారణమని వాతావరణ శాఖ (ఐఎండీ) శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. మహారాష్ట్రలోని విదర్భ సరిహద్దులో ఉండటం వల్ల, మధ్య భారతం నుంచి వీచే పొడి, వేడి గాలులు ఇక్కడ ఉష్ణోగ్రతలను అమాంతం పెంచుతున్నాయి. దీనికి తోడు 2021లో 18,561 చదరపు కిలోమీటర్లుగా ఉన్న తెలంగాణ అటవీ విస్తీర్ణం, 2023 నాటికి 18,456 చదరపు కిలోమీటర్లకు తగ్గింది. ప్రధానంగా ఆదిలాబాద్, కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పచ్చదనం తగ్గడం వల్లే సహజసిద్ధమైన చల్లదనం లోపించి హీట్ వేవ్స్ తీవ్రత పెరుగుతోందని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

మరోవైపు రాజధాని హైదరాబాద్‌లోని పట్టణ ప్రాంతాలు కూడా గ్లోబల్ హీట్ లిస్టులో చేరుతున్నాయి. మూసీ నది పరీవాహక ప్రాంతం కావడం, వేగంగా జరుగుతున్న పట్టణీకరణ, భూగర్భ జలాలు పడిపోవడం వల్ల ఇక్కడ వేడి ఎక్కువగా ట్రాప్ అవుతోంది. నగరంలోని న్యూ నాగోల్ ప్రాంతంలో 41.7 డిగ్రీల సెల్సియస్ నమోదు కాగా, ముషీరాబాద్‌లో 41.6, అంబర్‌పేటలో 41.4, మల్కాజిగిరి, ఎల్బీనగర్ ప్రాంతాల్లో 41.3, మెహదీపట్నంలో 41.1 డిగ్రీల మేర ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి.

రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఎండలు దంచికొడుతున్నా.. రానున్న 24 గంటల్లో కొన్ని చోట్ల ఊరట లభించే అవకాశం ఉంది. నిజామాబాద్, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, హనుమకొండ, వికారాబాద్, మెదక్, మేడ్చల్, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, గద్వాల, కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల్లో సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో కూడిన గాలివాన కురిసే సూచనలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. అయితే, పగటి పూట ఎండ తీవ్రత మాత్రం 40 నుంచి 45 డిగ్రీల మధ్యే కొనసాగే ప్రమాదం ఉందని, బయటకు వచ్చే ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# తెలంగాణకు 8 కొత్త రైళ్లు

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** :రైల్వే మంత్రిత్వ శాఖ తెలంగాణకు ఎనిమిది కొత్త రైళ్లను ప్రకటించింది. హైదరాబాద్‌లోని కాచిగూడ, చర్లపల్లి, నాంపల్లి స్టేషన్ల నుంచి దేశంలోని పలు ప్రాంతాలకు కనెక్టివిటీ పెంచేలా ఈ కొత్త వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లకు కేంద్ర రైల్వే శాఖ ఆమోదం తెలిపింది. హైదరాబాద్ నుంచి ఈ వీక్లీ ఎక్స్‌ప్రెస్‌లు భువనేశ్వర్, తిరుచానూరు, తిరుపతి, శ్రీ గంగానగర్, జైపూర్ వంటి ముఖ్యమైన నగరాలకు కనెక్టివిటీని పెంచుతాయని, దీంతో ప్రయాణం మరింత సులభతరం అవుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. కాగా, ఈ రైళ్లు మే నుంచి జూలై మధ్య దశల వారీగా ప్రారంభం అవుతాయి. రైళ్లన్నీ వారానికి ఒకసారి నడుస్తాయి. కాగా, తెలంగాణకు ఎనిమిది రైళ్లను కేటాయించినందుకు ప్రధాని మోదీకి, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.



# కాళేశ్వరం కమిషన్‌పై నేడు తీర్పు

**హైదరాబాద్,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై ఏర్పాటు చేసిన కమిషన్‌కు సంబంధించిన కేసులో తెలంగాణ హైకోర్టు బుధవారం కీలక తీర్పు ఇవ్వనుంది. ఈ కమిషన్‌ను సవాల్ చేస్తూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు పిటిషన్లు దాఖలు చేసిన విషయం తెలిసిందే. జస్టిస్ ఘోష్ నేతృత్వంలోని కమిషన్‌ను రద్దు చేయాలని కోరుతూ వారు కోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉండగా, కమిషన్ నివేదిక ఆధారంగా ఎలాంటి చర్యలు తీసుకోకూడదని గతంలో హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో నేడు వెలువడే తీర్పు రాష్ట్ర రాజకీయాల్లో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ కేసులో కోర్టు తీసుకునే నిర్ణయం కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన తదుపరి పరిణామాలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# ఏపీలో మున్సిపల్ కార్మికుల సమ్మె.. నిలిచిపోనున్న పారిశుద్ధ్య సేవలు



ఏపీలో మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులు సమ్మె బాట పట్టారు. మార్చి నెల జీతాలు ఇప్పటికీ అందకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ్టి నుంచి సమ్మె చేస్తున్నట్లు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రకటించింది. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగుతుందని కార్మిక సంఘాలు స్పష్టం చేశాయి.సకాలంలో జీతాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ కష్టంగా మారిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల రెండు నుంచి నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు ఆరోపిస్తున్నారు. మార్చి నెల జీతాల చెల్లింపులో సాంకేతిక సమస్య తలెత్తిందని అధికారులు చెబుతున్నా, పురపాలకశాఖ మంత్రితో చర్చించినా పరిష్కారం కాలేదని కార్మిక సంఘాల నేతలు తెలిపారు.జీతాలతో పాటు మరికొన్ని కీలక డిమాండ్లను కూడా కార్మికులు ప్రభుత్వం ముందుంచారు. పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని, మరణించిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని వారు విమర్శిస్తున్నారు.కార్మికుల సమ్మెతో రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో పారిశుద్ధ్య పనులు నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. చెత్త సేకరణ, డ్రైనేజీ నిర్వహణ వంటి సేవలకు అంతరాయం కలగనుంది. ప్రభుత్వం వెంటనే తమను చర్చలకు పిలిచి, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. స్పష్టమైన హామీ లభించే వరకు విధులకు హాజరయ్యేది లేదని వారు స్పష్టం చేశారు.

# ఎన్‌డిఏకు ఓటేయండి

**పూర్వవైభవం రావాలంటే మార్పు రావాలి**

**మోడీ నేతృత్వంలో దేశానికి సమర్థ నాయకత్వం**

**ఎన్‌డిఏ నేతలతో చంద్రబాబు మీడియా సమావేశం**






**చెన్నై, ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** తమిళ ప్రజల భవిష్యత్తు కోసం తానే స్వయంగా చెన్నైకి వచ్చినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. దేశాభివృద్ధి కోసం ప్రధాని నరేంద్ర మోదీ ముందు చూపుతో ఆలోచిస్తారని.. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏకు ఓటు వేయాలని ఆయన కోరారు. తమిళనాడుకు పూర్వ వైభవం రావాలంటే ఎన్డీయే కూటమిని గెలిపించాలి. దేశానికి నరేంద్ర మోదీ వంటి సమర్థ నాయకత్వం ఉంది. సరైన సమయంలో మంచి ఆలోచన చేయాలని తమిళనాడు ప్రజలను కోరుతున్నా. సమర్థులను ఎన్నుకుంటే బంగారు భవిష్యత్తు ఉంటుందని చంద్రబాబు అన్నారు. ఒకప్పుడు దేశంలో చెన్నై కీలక స్థానంలో ఉందని.. ఇప్పుడు పరిస్థితి మారిందన్నారు. నగర అభివృద్ధి గణనీయంగా మందగించిందని.. చెన్నై ఎయిర్‌పోర్టు పరిస్థితి సంతృప్తికరంగా లేదన్నారు. బెంగళూరు, హైదరాబాద్ వేగంగా అభివృద్ధి చెందాయని.. ఐటీ, మౌలిక వసతులు, పెట్టుబడుల విషయంలో ముందున్నాయని ముఖ్యమంత్రి చెప్పుకొచ్చారు. తమిళనాడులో సీఎం చంద్రబాబు పర్యటన రెండో రోజు కొనసాగుతోంది. ఎన్డీఏకి మద్దతు కోరుతూ చెన్నైలో చంద్రబాబు మీడియా సమావేశం నిర్వహించారు. మీడియా సమావేశంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, తమిళనాడు ఎన్‌డిఏ నేతలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..'తమిళనాడుకు గొప్ప చరిత్ర, సాంస్కృతిక వారసత్వం ఉంది. ఒకప్పుడు చెన్నై ప్రధాన కేంద్రంగా సినీ పరిశ్రమ, ఉద్యోగ అవకాశాలు విస్తారంగా ఉండేవి. నా వివాహం కూడా ఇక్కడే జరిగింది. ఈ నగరంతో నాకు ప్రత్యేక అనుబంధం ఉంది. ఏపీజే అబ్దుల్ కలాం, ఎంఎస్ స్వామినాథన్, అన్నాదురై వంటి మహానుభావులు తమిళనాడులో జన్మించారు. దేశానికి గొప్ప మేధావులను ఈ రాష్ట్రం అందించింది. కానీ, ప్రస్తుతం చెన్నైలో లా అండ్ ఆర్డర్ పరిస్థితి దెబ్బతింది. మహిళలపై నేరాలు సుమారు 59 శాతం మేర పెరిగాయి. కస్టోడియల్ డెత్ కేసులూ పెరిగాయి. నకిలీ మద్యం ఘటనలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారుతున్నాయి. చెన్నై ఇన్‌ఫ్రాస్టక్చర్‌లో పెద్దగా మార్పు కనిపించడం లేదు. 1995 నుంచి చాలా రోడ్లు అలానే ఉన్నాయి. వర్షాలు పడితే నగరంలో రోడ్లు మునిగిపోతున్నాయి. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. ?తమిళనాడుకు కేంద్రం నుంచి సమృద్ధిగా నిధులు వచ్చాయి. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్‌కు ఎంజీ రామచంద్రన్ పేరు పెట్టింది కేంద్ర ప్రభుత్వమే. ?హైస్పీడ్ రైలు ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రకటించారు. ఈ ప్రాజెక్టులు రాష్ట్రాభివృద్ధికి గేమ్ ఛేంజర్‌గా మారుతాయి. ప్రకాశవంతమైన భవిష్యత్, మంచి ఉద్యోగ అవకాశాలు కావాలంటే ప్రజలు ఈసారి జాగ్రత్తగా, తెలివిగా ఓటు వేయాలి. డబుల్ ఇంజన్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. కేంద్ర, రాష్ట్ర సమన్వయం ఉంటే అభివృద్ధి వేగంగా జరుగుతుంది. కేవలం రాజకీయ కారణాలతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా వెళ్లకూడదు. రాజకీయ లాభాల కోసం రాష్ట్రానికి నష్టం చేయడం సరైంది కాదు. అన్ని రాష్ట్రాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉంది. ప్రధాని మోదీకి సహకరించి దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలి. పార్లమెంట్‌లో డీలిమిటేషన్ బిల్లు, మహిళా రిజర్వేషన్ బిల్లులను కాంగ్రెస్, డీఎంకే పార్టీలు అడ్డుకున్నాయి. మహిళలకు రావాల్సిన ప్రాతినిధ్యాన్ని అడ్డుకుని ద్రోహం చేశాయి. దక్షిణాది రాష్ట్రాలకు లెక్కల ప్రకారం సీట్లు తగ్గుతాయని ప్రచారం జరుగుతోంది. కానీ వాస్తవానికి సీట్లు పెరుగుతాయి. బిల్లులో స్పష్టంగా సీట్ల పెంపు గురించి పేర్కొన్నారు. తమిళనాడులో ప్రస్తుతం 39 సీట్లు ఉండగా.. 59కి పెరిగే అవకాశం ఉంది.

# సీతారామపై మంత్రి తుమ్మల ఫోకస్

**ప్రాజెక్టు పనుల పరిశీలన.. అధికారులతో కీలక సమీక్ష**

**సత్తుపల్లి,/ ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):**



సీతారామ ప్రాజెక్టు పురోగతిపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి ఫోకస్ పెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు పనులను వేగవంతం చేసేందుకు బుధవారం ప్రాజెక్టు బాట పట్టనున్నారు.మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి సీతారామ ప్రాజెక్టుపై ప్రత్యేక దృష్టి సారించిన తుమ్మల, ఇప్పటికే పలుమార్లు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ప్రాజెక్టు ఎదుర్కొంటున్న అడ్డంకులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో బుధవారం అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టి పంపు వద్ద నుంచి పర్యటన ప్రారంభించి కాలువల నిర్మాణాన్ని పరిశీలించనున్నారు. అనంతరం యాతాలకుంట టన్నెల్ పనులను సందర్శించి, అక్కడే అధికారులతో కీలక సమీక్ష నిర్వహించనున్నారు.మంత్రి వెంట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమై దయానంద్ విజయ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొననున్నారు.

# గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఊతమివ్వాలి

**ఉపాధి హామీని మరింతగా విస్తరించాలి -ఎక్స్ వేదికగా జగన్ పోస్ట్**



**అమరావతిఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** )గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ప్రభుత్వ మద్దతు క్రమంగా తగ్గిపోతుందని వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.. గ్రామీణ ప్రజలకు కీలకంగా ఉపయోగపడేజాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎక్స్ వేదికగా స్పందించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే ఎంజీఎన్ఆర్ఈజీఏ పథకం సమర్థవంతంగా అమలు కావడం అత్యంత కీలకమని జగన్ పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల చేతిలో ఖర్చు చేయగలిగే ఆదాయం పెరుగుతుందని, దాంతో గ్రామీణ మార్కెట్లలో వినియోగం పెరిగి ఆర్థిక చలనం వస్తుందని వివరించారు. ఎక్కువగా ఖర్చు చేసే వర్గాల చేతిలో డబ్బు ఉంటే గ్రామీణ ఆదాయ వినియోగం పెరుగుతుందని, అది మొత్తం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మేలు చేస్తుందని అన్నారు వైఎస్ జగన్. గతంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలులో దేశవ్యాప్తంగా అగ్రగామి రాష్ట్రంగా గుర్తింపు పొందిందని గుర్తు చేశారు. అయితే, గత రెండేళ్లుగా టీడీపీ కూటమి ప్రభుత్వ హయాంలో ఈ పథకం పనితీరు తీవ్రంగా పడిపోయిందని జగన్ విమర్శించారు. లేబర్ బ్జడెట్, పని చేసిన కుటుంబాల సంఖ్య, ఖర్చు చేసిన నిధులు వంటి అన్ని అంశాల్లో గణనీయమైన తగ్గుదల కనిపిస్తోందని ఆరోపించారు. గత రెండేళ్లలో జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్ వృద్ధి రేట్లు కూడా తగ్గాయని జగన్ తెలిపారు. ఇది ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయిందనే సంకేతమని అన్నారు. ప్రజల చేతిలో డబ్బు లేకపోవడంతో డిమాండ్ పడిపోతుందని, దాని ప్రభావం వ్యాపార రంగంపై కూడా పడుతోందని చెప్పారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం విఫలమవుతోందని దుయ్యబట్టారు.. అవినీతి ఆరోపణలు, సంపద కూడబెట్టాలనే అధిక ఆశలతో ప్రభుత్వం దారి తప్పుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న అసలు సమస్యలను పట్టించుకునే స్థితిలో ప్రభుత్వం లేదని మాజీ సీఎం జగన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

-------------

# జ్ఞాపకాలతో సేవా స్ఫూర్తి

**చలివేంద్రం ప్రారంభం**



**పాల్వంచఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** ఎండల తీవ్రత పెరుగుతున్న వేళ ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రం సేవా భావానికి నిదర్శనమని టీపీసీసీ జనరల్ సెక్రటరీ నాగా సీతారాములు పేర్కొన్నారు.మండల పరిధిలో మిల్లు కృష్ణ, భవాని, మనుమరాలు నరిగే సోనీభవాని జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూడ నరిగే సరోజినీదేవి, మిల్లు కృష్ణ కుటుంబం సేవా దృక్పథంతో ముందుకొచ్చి ప్రజలకు చల్లని మంచినీటి సదుపాయం కల్పించడం అభినందనీయమన్నారు.పాల్వంచ పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి శాస్త్రిరోడ్ మీదుగా రాకపోకలు సాగించే ప్రజలకు ఈ చలివేంద్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో 45వ డివిజన్ కార్పొరేటర్ దంతేబోయిన నరేష్, నరిగే శ్రీనుసుజాత, నరిగే రమేష్, నరిగే రవీందర్, కేశవాపురం ఉపసర్పంచ్ లక్ష్మీనారాయణ, తీరుమల రమేష్, కొప్పరపు లక్ష్మణ్, చీకటి బాబురావు, బృందావనం రెస్టారెంట్ జిల్లు, ముజేందర్ దీపు, నరిగే అవినాష్, ఓబీసీ పట్టణ అధ్యక్షుడు జయప్రకాష్, ఉపాధ్యక్షుడు బొబ్బాల వెంకటేశ్వరరావు, సాయిచందు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ హత్యలకు డెన్‌గా వైసిపి

**పార్టీ అనుమతులపై ఇసి ఆలోచన చేయాలి**

**దస్తగిరి హత్యతో వైసిపి నైజం మరింత బయటపడింది**

**మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు**



**అమరావతి,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** వైసీపీ రాజకీయ పార్టీ కాదని.. హత్య రాజకీయాలకు డెన్‌గా తయారైందని ఆంధ్రప్రదేశ్ సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాజకీయ పార్టీగా కొనసాగే అర్హత వైసీపీకి లేదని ధ్వజమెత్తారు. ఆ పార్టీ అనుమతులపైన ఎలక్షన్ కమిషన్ కూడా ఆలోచన చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. వైసీపీ కార్యకర్త పెద్ద దస్తగిరి హత్య వెనక ఆ పార్టీ పెద్దల హస్తం ఉందని ఆరోపించారు. ఐదేళ్ల అధికారాన్ని అడ్డుపెట్టుకొని దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పార్టీ చేసిందని విమర్శించారు. మంగళవారం అమరావతి వేదికగా మంత్రి పార్థసారథి మీడియాతో మాట్లాడారు. చీకట్లో చంపడం.. పగలు వెళ్లి పరామర్శించడం వైసీపీ నేతలకు అలవాటుగా మారిందని ఎద్దేవా చేశారు.

పెద్ద దస్తగిరి ఇంట్లో వందల కోట్ల విలువ చేసే డాక్యుమెంట్లు దొరికాయని మంత్రి కొలుసు పార్థసారథి ప్రస్తావించారు. జగన్ మేనమామ, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న ఆస్తుల డాక్యుమెంట్లు, హత్యకు గురైన పెద్ద దస్తగిరి ఇంట్లో ఎలా లభించాయని ప్రశ్నించారు. హత్యకు గురైన పెద్ద దస్తగిరి.. కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి అత్యంత ముఖ్యుడని చెప్పుకొచ్చారు. ఆస్తులు, అధికారం కోసం వైసీపీ నేతలు ఎంతకైనా దిగజారుతారని విమర్శించారు. మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య నుంచి, పెద్ద దస్తగిరి హత్య వరకు వైసీపీ ఒకే తరహా నాటకమాడుతోందని ఎద్దేవా చేశారు. పెద్ద దస్తగిరి హత్యకు ప్రధాన కారకులైన వారు.. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. వైసీపీ నేతలు చేసిన పాపాలను ప్రజలు క్షమించరని హెచ్చరించారు. వైసీపీని ఒక రాజకీయ పార్టీగా ప్రజలు చూడటం లేదని.. రాజకీయాల్లో కొనసాగే అర్హత ఆ పార్టీకి లేదని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై మంత్రి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన ధనదాహం, అధికారదాహానికి ఎవరు అడ్డొచ్చినా తల్లైనా, చెల్లైనా, బాబాయ్ అయినా ఎవరైనా ఒకటేనని ఎద్దేవా చేశారు. జగన్ క్రిమినల్ రాజకీయాలు చేస్తున్నారనే విషయాన్ని.. వైసీపీ కార్యకర్తలు ఇప్పటికైనా ఆలోచించాలని అన్నారు. పెద్ద దస్తగిరి హత్య, బాబాయ్ హత్య, జగన్ కారు చక్రాల కింద నలిగిన కార్యకర్త ఇలా ఎన్నో ఉదాహరణలు జగన్ నైజాన్ని బహిర్గతం చేస్తున్నాయని తెలిపారు. జగన్ సన్నిహితుడు నిత్యానంద రెడ్డి సొంత పార్టీకి చెందిన దస్తగిరిని హత్య చేయటం జగన్ స్వార్థాన్ని తెలుపుతోందన్నారు. తాడేపల్లిలో తనకున్న అనుబంధంలో భాగంగానే దస్తగిరి హత్య జరిగిందని ఆరోపించారు. హింసా రాజకీయాలు నడిపే వారికి రాష్ట్రంలో చోటు లేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు విజ్ఞతతో ఆలోచించి.. వైసీపీకి ఏపీలో చోటు లేకుండా చేయాలని మంత్రి సూచించారు.

# పవన్ కల్యాణ్ ఆరోగ్యం కోసం కొండగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు

**ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):**



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా కుదుటపడాలని కోరుతూ చొప్పదండి నియోజకవర్గ జనసేన శ్రేణులు జగిత్యాల జిల్లాలోని ప్రఖ్యాత కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవన్ కల్యాణ్ త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజాసేవలో నిమగ్నం కావాలని జనసేన నేతలు స్వామిని కోరుకున్నారు.

ఈ పూజల్లో మొగిలిపాలెం రమేశ్, తడగొండ నర్సింగ్ బాబు, దూడం శ్రీనాథ్, కనకట్ల శ్రీనివాస్, పలువురు జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పవన్ కల్యాణ్‌కు కొండగట్టు అంజన్న అంటే ఎంతటి అపారమైన నమ్మకమో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే క్షేత్రంలో ఆయన కోసం పూజలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# వాతావరణ హెచ్చరికలు గుణపాఠం కావాలి !

**అమరావతిఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** భగభగమండుతున్న ఎండలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంతో ఎండల తీవ్రత విపరీతంగా ఉంది. దీనికితోడు ఈ యేడు వర్షాలు కూడాతక్కువేనని వాతావరణశాఖ ఇప్పటికే హెచ్చరించింది. వాతావరణ అసమతుల్యత కారణంగా ఇలా జరుగుతోంది. ఏటా హెచ్చరికలు వస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ప్రజలకు బాధ్యత లేకుండా పోతోంది. అదేపనిగా నదుల్లో నుంచి ఇసుకను తోడేస్తున్నారు. కొండలను పిండి చేస్తున్నారు. అడవులను నరికి వేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఇదే పరిస్థితి దాపురించింది. బయటకు వెళితే ఎక్కడైనా చెట్టునీడ కనిపించడం లేదు. ఇకపోతే ఇప్పటికే రైతులకు ఎరువులు అందడం లేదు. నీటి పారకం తగ్గింది.వాతావరణ కాలుష్యం పెరుగుతోంది. నీటిని సక్రమంగా వాడుకునే పద్దతులు నేటికీ అమలు కావడం లేదు. అధికంగా ఎరువులు వాడకం వల్ల భూసారం తగ్గిపోతోంది. ఒకవైపు అమెరికా యుద్ధోన్మాదం కూడా మన రైతాంగంపై పడుతోంది. మరోవైపు ఎల్ నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉంటుందని, రుతు పవనాలూ మందగిస్తాయని భారత వాతావరణ శాఖ ఈపాటికే హెచ్చరించింది. పసిఫిక్ మహా సముద్రంలో ఉష్ణోగ్రతలు పెరిగి, ఎల్ నినో పరిస్థితులు తలెత్తటం



ఈ ఏడాది వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. మే, జులై నెలల మధ్య వర్షాభావ పరిస్థితులు ఏర్పడి, అక్టోబరు వరకూ ఉండొచ్చని అంటున్నారు. దీనివల్ల మనకు ఎక్కువ వర్షపాతాన్నిచ్చే నైరుతి రుతు పవనాలు మందగించి, తీవ్ర వర్షాభావం ఏర్పడవచ్చు. నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు ప్రణాళికలు రూపొందించి, కార్యాచరణకు పూనుకోవాలి. పరిస్థితులను ముందే గమనించి వచ్చే వర్షాకాలానికి తగిన ప్రణాళికలు సిద్దం చేసుకోవాలి. సాగునీటికి అవసరమైన వర్షాలు ఎలా ఉన్నా మిగతావన్నీ ప్రభుత్వాల సన్నద్ధతతో, ముందు చూపుతో ఆధారపడి ఉన్నాయి. ప్రతి ఏటా పాలకులు నిర్లక్ష్యం వల్ల, విత్తనాలూ, ఎరువులూ సమకూర్చక పోవటం వల్ల రైతులు నానా అగచాట్లకూ గురవుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో రోడ్డెక్కడం, ఆందోళనలకు దిగటం పరిపాటిగా మారింది. ఈ పరిస్థితులను గుర్తించి ముందుగానే మేల్కొని తగిన సన్నాహాలు చేయడం, సకాలంలో సహాయ సహకారాలు అందివ్వడం పాలకుల సంక్ష్యం కావాలి. ఏటా ఖరీఫ్ కాలం అన్నదాతకు ఆశలతో పాటు అనేక కష్టనష్టాలను కూడా మోసుకొని రావడం ప్రతి ఏటా చూస్తున్నాం. విత్తనాలు, ఎరువులు, సాగునీరు, పెట్టుబడి తదితర అవసరాలు నలువైపుల నుంచి చుట్టుముట్టి రైతాంగానికి సమస్యలుగా పరిణమిస్తాయి. ఇవన్నీ కూడా పరిష్కరించదగ్గవే అయినా పాలకలు దృష్టిలోపం కారణంగా ఇబ్బంది పడాల్సి వస్తోంది. కూలీల కొరత కూడా తీవ్రంగా ఉంటోంది. జనాభా అత్యధికంగా ఉన్నా రైతులకు కూలీలు దొరకడం లేదు. వ్యవసాయం గిట్టుబాటు కాకపోడంతో యువరైతులు వ్యవసాయం వదిలేస్తున్నారు. చిన్న కమతాల్లో కూడా ట్రాక్టరు ఆధారిత వ్యవసాయం నేడు సర్వసాధారణం అయిపోయింది. ట్రాక్టరు, మోటారు వంటి యంత్ర సాధనాలు నడవాలంటే డీజిలు చాలా అవసరం. పశ్చిమాసియాలో సాగుతున్న యుద్ధ బీభత్సం చమురు దిగుమతుల పైనా, ఎరువుల తయారీకి ఉపయోగపడే ముడిసరుకు రవాణాపైనా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దీంతో పాటు రష్యా, ఇరాన్‌ల నుంచి మన దేశ చమురు దిగుమతులపై అమెరికా ఆంక్షలు విధించటం సమస్యగా మారింది. సాధారణ పరిస్థితుల్లోనే మన రైతులకు అవసరమైన పరిమాణంలో ఎరువులను సకాలంలో పంపిణీ చేయడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ఇప్పుడున్న ప్రతికూల పరిస్థితుల్లో ప్రత్యేకంగా పూనుకుంటే తప్ప- అవసరమైన ఎరువులు, రుణాలు వంటివి సకాలంలో సమాకూరవు. ఇప్పటికే పశ్చిమాసియాలో నెలకొని ఉన్న యుద్ధ వాతావరణంలో రైతాంగానికి ఎంతో నష్టం తెచ్చి పెడుతోంది. రొయ్యలు, బియ్యం, పండ్లు, పూలు వంటి వ్యవసాయోత్పత్తుల ఎగుమతులు ఆగిపోవడంతో రైతులకు కష్టాలు తప్పడం లేదు. సాగుకు అవసరమైన పరిస్థితులను కల్పించాలి. వాతావరణ పరిస్థితులు, సాగునీటి లభ్యతలకు అనుగుణంగా ఎక్కడ ఏ పంట వేయాలో వ్యవసాయ శాఖ ద్వారా మార్గనిర్దేశనం చేయాలి. పరిస్థితులకు తగినట్టుగా వ్యవసాయశాఖ ప్రణాళిక రూపొందించాలి. అవసరమైన విత్తనాలు, ఎరువులు, రుణాలు ఏర్పాటు చేయాలి. ప్రత్యేక నిధులు కేటాయించి, ఏ ప్రాంతంలో రైతులకు ఏది అవసరమో అది వెనువెంటనే అందించే సన్నద్ధత, యంత్రాంగ ఏర్పాటూ ఉండాలి. ప్రపంచ పరిస్థితుల్లోనూ, ప్రకృతిలోనూ ప్రతికూలతలు పొటమరిస్తున్న వేళ పాలకులు ముందుచూపుతో సాగాలి. ఇకపోత తాగునీటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. ఈ వేసవిలో సమస్య తీవ్రత కనిపిస్తోంది. తెలంగాణ, ఎపిల్లో ఎప్పటికప్పుడు సమస్యలను ఆకళింపు చేసుకుని సాగాలి. ఈ రెండు నెలల పాటు తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సి ఉంటుంది.

--------------

# పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు..

## వర్మ వర్సెస్ పెండెం దొరబాబు

**పిఠాపురంలో మరోసారి భగ్గుమన్న టీడీపీ-జనసేన వర్గపోరు**

**ప్రభుత్వ కార్యక్రమ ఫ్లెక్సీలో సీఎం ఫొటో లేకపోవడంపై వివాదం**

**టీడీపీ నేత వర్మ, జనసేన నేత దొరబాబు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట**

**క్రమశిక్షణ తప్పితే సహించేది లేదంటూ వర్మ ఘాటు హెచ్చరిక**

**అమరావతి,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో మిత్రపక్షాలైన టీడీపీ, జనసేన మధ్య విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. ఓ ప్రభుత్వ కార్యక్రమ ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫొటో లేకపోవడం తీవ్ర వివాదానికి, తోపులాటకు దారితీసింది.మంగళవారం పిఠాపురంలో



ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సీఎం చంద్రబాబు ఫొటో లేకపోవడాన్ని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్వీఎస్ఎన్ వర్మ గమనించి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమంలో సీఎం ఫొటో పెట్టకపోవడం ప్రోటోకాల్ ఉల్లంఘనేనని ఆయన జనసేన నాయకులను, అధికారులను నిలదీశారు. ఈ క్రమంలో జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మలబాబుతో వర్మకు వాగ్వాదం జరిగింది. ఇంతలో మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కల్పించుకుని వర్మపైకి దూసుకెళ్లడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఇరువర్గాల కార్యకర్తలు ఒకరినొకరు నెట్టుకోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతింపజేశారు.

అనంతరం వర్మ మాట్లాడుతూ, దొరబాబు తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "జనసేన, టీడీపీ ఒకే కుటుంబం. కానీ, వైసీపీ నుంచి వచ్చిన వారు ఇక్కడ పెత్తనం చెలాయిస్తే ఎలా? క్రమశిక్షణ తప్పితే తోలు తీస్తా" అంటూ ఘాటుగా హెచ్చరించారు. పవన్ కల్యాణ్ గెలుపు కోసం తామంతా కష్టపడితే, గెలిపించిన టీడీపీ నాయకులపైనే దాడులు చేస్తారా? అని ప్రశ్నించారు. ముఖ్యమంత్రికి అవమానం జరిగితే సహించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ ఘటన పిఠాపురంలో కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపాన్ని మరోసారి బహిర్గతం చేసింది.

# దస్తగిరి హత్యపై ప్రభుత్వం సీరియస్

## నిత్యానంద రెడ్డి కోసం పోలీసుల గాలింపు



**కడప,,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** నగరంలో జరిగిన వైసీపీ కార్యకర్త పెద్దదస్తగిరి హత్య కేసుపై ప్రభుత్వం సీరియస్ అయింది. పోలీసులు లోతుగా విచారణ చేస్తూ కేసును అన్ని కోణాల నుంచి పరిశీలిస్తున్నారు. హత్య వెనుక ఉన్న కారణాలను బయటపెట్టడానికి ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. దస్తగిరి హత్యతో సంబంధం ఉన్న వైసీపీ నేత, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి కోసం పోలీసులు విస్తృతంగా గాలిస్తున్నారు. నిత్యానంద రెడ్డిని వీలైనంత త్వరగా అరెస్ట్ చేసి విచారించాలని పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.హతుడు పెద్దదస్తగిరి ఇంట్లో నిర్వహించిన తనిఖీల్లో వైసీపీ నేతలకు సంబంధించిన కీలక డాక్యుమెంట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇందులో 145 ఎకరాల భూములకు సంబంధించిన పత్రాలు ఉన్నాయి. ఈ భూముల మొత్తం విలువ 100 కోట్ల రూపాయలకు పైగా ఉందని పోలీసు వర్గాలు తెలిపాయి. మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి నివాసంలో గత రాత్రి నాలుగు గంటల పాటు పోలీసులు తనిఖీలు చేపట్టారు. పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. పోలీసులు చేపట్టిన విచారణతో వైసీపీ నేతల్లో టెన్షన్ నెలకొంది.

# తమిళనాడు తీరప్రాంతానికి వర్షహెచ్చరిక



**చెన్నై,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** తమిళనాడు రాష్ట్రంలోని దక్షిణ జిల్లాల తీరప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. ఈ మేరకు చెన్నై ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... ఉత్తర కర్ణాటక నుంచి రాష్ట్రం మీదుగా మన్నార్‌వలైకుడ వరకు ఉపరితల ఆవర్తనం నెలకొంది. ఈ కారణం గా, పశ్చిమ కనుమల సరిహద్దు జిల్లాలు, దక్షిణ జిల్లాల సముద్రీతీరప్రాంతాల్లో మంగళ, బుధవారా ల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. తూణరాష్ట్రంలోని మిగిలిన ప్రాంతాలు, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో పొడి వాతావరణం నెలకొంటుంది. రాష్ట్రంలోని అంతర్ జిల్లాల్లో ఈ నెల 23వ తేది వరకు ఉష్ణోగ్రతలు 3 డిగ్రీల వరకు పెరిగే అవకాశముంది. రాజధాని నగరం చెన్నైలో రానున్న 48 గంటల వరకు ఆకాశం మేఘావృతంగా ఉంటూ గరిష్ట ఉష్ణోగ్రత 37 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రత 27 డిగ్రీల సెల్సియ్‌సగా నమోదయ్యే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

# ఏపీలో ఉద్యోగుల స్థానికతపై కొత్త రూల్స్..

## అమల్లోకి రాష్ట్రపతి ఉత్తర్వులు

**1975 నాటి ఉత్తర్వుల స్థానంలో 2025 పేరుతో కొత్త నిబంధనలు**

**డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 95 శాతం పోస్టులు స్థానికులకే రిజర్వ్**

**26 జిల్లాల ప్రాతిపదికన జిల్లా, జోనల్, మల్టీ-జోనల్ కేడర్ల పునర్వ్యవస్థీకరణ**

**కేడర్ల మార్పు ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రభుత్వానికి 27 నెలల గడువు**



ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్లు, నియామకాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కొత్త నిబంధనలను అమలులోకి తెచ్చింది. 1975 నాటి పాత విధానాన్ని రద్దు చేస్తూ, "ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ఎంప్లాయ్‌మెంట్ ఆర్డర్, 2025" పేరుతో జారీ అయిన కొత్త రాష్ట్రపతి ఉత్తర్వులను ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 26 జిల్లాలకు అనుగుణంగా ఉద్యోగ వ్యవస్థను పునర్వ్యవస్థీకరించేందుకు ఈ మార్పులు చేసినట్లు ప్రభుత్వం పేర్కొంది.

ఈ కొత్త ఉత్తర్వుల ప్రకారం, ప్రభుత్వ ఉద్యోగాల డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌లో 95 శాతం పోస్టులను స్థానిక అభ్యర్థులకే రిజర్వ్ చేయనున్నారు. జిల్లా, జోనల్, మల్టీ-జోనల్ కేడర్ పోస్టులకు ఈ నిబంధన వర్తిస్తుంది. "స్థానిక అభ్యర్థి" నిర్వచనాన్ని కూడా ప్రభుత్వం స్పష్టం చేసింది. సంబంధిత అర్హత పరీక్షకు హాజరైన విద్యా సంవత్సరంతో ముగిసేలా, వరుసగా నాలుగు విద్యా సంవత్సరాలు స్థానిక ప్రాంతంలోని విద్యాసంస్థలో చదివిన వారిని లోకల్ అభ్యర్థిగా పరిగణిస్తారు.

కొత్త విధానం ప్రకారం కేడర్లను మూడు స్థాయిలుగా వర్గీకరించారు. జూనియర్ అసిస్టెంట్, తత్సమాన స్థాయి పోస్టులను జిల్లా కేడర్‌గా, ఆపై సూపరింటెండెంట్, ఫస్ట్-లెవల్ గెజిటెడ్ స్థాయి పోస్టులను జోనల్ కేడర్‌గా, డిప్యూటీ కలెక్టర్ స్థాయి వరకు ఉన్న పోస్టులను మల్టీ-జోనల్ కేడర్‌గా నిర్ధారించారు. ఈ కొత్త నిబంధనలకు అనుగుణంగా అన్ని ప్రభుత్వ సివిల్ పోస్టులను స్థానిక కేడర్లుగా విభజించే ప్రక్రియను 27 నెలల్లోగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ అయ్యాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 371డి కింద ఈ కొత్త ఉత్తర్వులను అమలు చేస్తున్నారు.

# సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్రస్థాయి కమిటీ..

**ఉత్తర్వులు జారీ చేసిన ఏపీ ప్రభుత్వం**

**సముద్ర తాబేళ్ల సంరక్షణ కోసం రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీ ఏర్పాటు**

**సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం ఈ నిర్ణయం**

**చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్ ఛైర్మన్‌గా ఈ కమిటీ**

**మత్స్యకారులు, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలకు కమిటీలో చోటు**



**అమరావతి,ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** :ఆంధ్రప్రదేశ్‌లో సముద్ర తాబేళ్ల సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. వీటి పరిరక్షణ చర్యలను సమర్థవంతంగా పర్యవేక్షించేందుకు ఒక రాష్ట్రస్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తూ నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది.గతేడాది డిసెంబర్ 17న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం, అన్ని తీరప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తాబేళ్ల సంరక్షణ కోసం ప్రత్యేక యంత్రాంగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో, రాష్ట్ర అటవీ దళాల అధిపతి (పీసీసీఎఫ్) సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించిన ప్రభుత్వం, కమిటీ ఏర్పాటుకు ఆమోదం తెలుపుతూ జీవో ఆర్టీ నెం. 45ను విడుదల చేసింది.ఈ కమిటీకి రాష్ట్ర చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. మత్స్యశాఖ కమిషనర్ మెంబర్ కన్వీనర్‌గా ఉంటారు. వీరితో పాటు అటవీ శాఖ, కోస్టల్ సెక్యూరిటీ గ్రూప్, కోస్ట్ గార్డ్ ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. ముఖ్యంగా, క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకునేందుకు మెకనైజ్డ్ బోట్ల యజమానుల సంఘం, సంప్రదాయ మత్స్యకార సంఘాల ప్రతినిధులకు కమిటీలో స్థానం కల్పించారు.వీరితో పాటు తాబేళ్ల సంరక్షణలో అనుభవం ఉన్న ట్రీ ఫౌండేషన్, టర్టిల్ యాక్షన్ గ్రూప్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూఐఐ), సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) నుంచి నిపుణులను కూడా సభ్యులుగా నియమించారు. పర్యావరణ, అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి చర్యలు తీసుకోవాలని పీసీసీఎఫ్‌ను ఆదేశించారు.

# అల్లు అర్జున్ పేరు, ఫొటోల వాడకంపై ఢిల్లీ హైకోర్టు నిషేధం

**ఇటీవలి కాలంలో పర్సనాలిటీ రైట్స్ కోసం కోర్టును ఆశ్రయిస్తున్న పలువురు ప్రముఖులు**




**ఏప్రిల్ 21 (ప్రజా వినికిడి):** టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌కు ఢిల్లీ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన పేరు, ఫొటో, వాయిస్‌తో పాటు ఇతర వ్యక్తిగత గుర్తింపులను ముందస్తు అనుమతి లేకుండా వ్యాపార అవసరాలకు వాడుకోవడంపై న్యాయస్థానం మధ్యంతర నిషేధం విధించింది. ముఖ్యంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీల ద్వారా అల్లు అర్జున్ ఇమేజ్‌ను దెబ్బతీసేలా వ్యవహరిస్తున్న పలు సంస్థలు, వెబ్‌సైట్లపై కఠిన ఆంక్షలు జారీ చేసింది.ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, కొన్ని వెబ్‌సైట్లు అక్రమంగా తన ఫొటోలతో కూడిన వస్తువులను విక్రయిస్తున్నాయని, ఏఐ టూల్స్ ద్వారా తన వాయిస్‌ను క్లోన్ చేసి ఫేక్ కాల్స్ సృష్టిస్తున్నారని తెలుపుతూ అల్లు అర్జున్ కోర్టును ఆశ్రయించారు. తన ప్రతిష్ఠను దిగజార్చేలా ఉన్న అసభ్యకరమైన కంటెంట్‌ను కూడా ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్నారని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన జస్టిస్ తుషార్ రావు గెడెలతో కూడిన సింగిల్ జడ్జి ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

# మధ్య ఓవర్లలో పట్టు కోల్పోయాం: శుభ్‌మన్ గిల్



ముంబై ఇండియన్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో గుజరాత్ టైటాన్స్ 99 పరుగుల భారీ తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. 200 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్ టైటాన్స్.. ముంబై బౌలర్ల ధాటికి కేవలం 100 పరుగులకే చాపచుట్టేసింది. అయితే జట్టు మొత్తం బ్యాటింగ్‌లో విఫలమైనప్పటికీ.. గుజరాత్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం ఈ ఓటమికి బౌలర్లనే బాధ్యులను చేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్ అనంతరం జరిగిన ప్రజెంటేషన్ కార్యక్రమంలో శుభ్‌మన్ గిల్ మాట్లాడుతూ.. తమ బౌలర్లు మధ్య ఓవర్లలో ధారాళంగా పరుగులు ఇచ్చేశారని అసహనం వ్యక్తం చేశాడు. పిచ్ స్లోగా ఉన్నందున ఇక్కడ 160 నుంచి 170 పరుగులు సరైన స్కోరు అని.. కానీ ముంబైని తక్కువ స్కోరుకు కట్టడి చేయడంలో తమ బౌలర్లు విఫలమయ్యారని గిల్ పేర్కొన్నాడు. సరైన లెంగ్త్‌లో బంతులు వేయకపోవడం వల్లే ముంబై భారీ స్కోరు సాధించిందని ఆయన అభిప్రాయపడ్డాడు.భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు కనీస పోరాట పటిమను కూడా కనబర్చలేదు. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ ఔట్ కాగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. ముంబై బౌలర్లు అశ్వని కుమార్ (4/24), మిచెల్ సాంట్నర్,అల్లా ఘజన్‌ఫర్ చెలరేగడంతో గుజరాత్ పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయింది. చివరకు 100 పరుగులకే ఆలౌట్ అయి ఐపీఎల్ చరిత్రలో తమ జట్టుకు ఉన్న అతిపెద్ద ఓటమి రికార్డును (99 పరుగులు) నమోదు చేసుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్, తిలక్ వర్మ (101లి) వీరోచిత సెంచరీతో 199 పరుగులు చేసింది. నిజానికి గుజరాత్ బౌలర్ కగిసో రబాడ పవర్‌ప్లేలోనే 3 వికెట్లు తీసి ముంబైని దెబ్బతీసినా.. మిడిల్ ఓవర్లలో ఇతర బౌలర్లు తిలక్ వర్మను అడ్డుకోలేకపోయారు. ముఖ్యంగా డెత్ ఓవర్లలో ముంబై బ్యాటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగిపోవడంతో గుజరాత్ చేతుల్లోంచి మ్యాచ్ జారిపోయింది.భారీ లక్ష్య ఛేదనలో గుజరాత్ టైటాన్స్ బ్యాటర్లు కనీస పోరాట పటిమను కూడా కనబర్చలేదు. ఇన్నింగ్స్ మొదటి బంతికే సాయి సుదర్శన్ ఔట్ కాగా.. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లు కూడా క్రీజులో నిలబడలేకపోయారు. ముంబై బౌలర్లు అశ్వని కుమార్ (4/24), మిచెల్ సాంట్నర్,అల్లా ఘజన్‌ఫర్ చెలరేగడంతో గుజరాత్ పవర్ ప్లేలోనే కీలక వికెట్లు కోల్పోయింది. చివరకు 100 పరుగులకే ఆలౌట్ అయి ఐపీఎల్ చరిత్రలో తమ జట్టుకు ఉన్న అతిపెద్ద ఓటమి రికార్డును (99 పరుగులు) నమోదు చేసుకుంది. ఈ అద్భుత విజయంతో ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో ఏడో స్థానానికి ఎగబాకింది. ఆడిన 6 మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో 4 పాయింట్లు సాధించి నెట్ రన్ రేట్‌ను మెరుగుపరుచుకుంది. మరోవైపు ఈ భారీ ఓటమి వల్ల గుజరాత్ టైటాన్స్ ఆరో స్థానానికి పడిపోయింది. మూడు విజయాలు ఉన్నప్పటికీ.. రన్ రేట్ భారీగా దెబ్బతినడం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. ఈ ఓటమి ఓ చిన్న అడ్డంకి మాత్రమేనని, రాబోయే మ్యాచుల్లో బలంగా పుంజుకుంటామని శుభ్‌మన్ గిల్ ధీమా వ్యక్తం చేశాడు.

# చాహల్ వద్దు.. కోహ్లీ లాంటోడు కావాలి

## ● బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా

టీమిండియా వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్‌తో తాను డేటింగ్ చేస్తున్నట్లు వచ్చిన వార్తలను బిగ్‌బాస్ 13 ఫేమ్, ప్రముఖ స్పోర్ట్స్ యాంకర్ షెఫాలీ బగ్గా కొట్టిపారేసింది. ఇలాంటి వార్తలతో తాను విసిగిపోయానని అసహనం వ్యక్తం చేసింది. కలిసి డిన్నర్ చేసినంత మాత్రాన డేటింగ్ అంటూ ప్రచారాం చేస్తారా? అని మండిపడింది.యుజ్వేంద్ర చాహల్‌తో కలిసి షెఫాలీ బగ్గా ఉన్న వీడియో ఒకటి వైరల్ కావడంతో ఈ ఇద్దరూ డేటింగ్‌లో ఉన్నారనే పుకార్లు వెలువడ్డాయి. తాజాగా ఈ వార్తలపై స్పందించిన షెఫాలీ బగ్గా.. తనకు చాహల్ వద్దని, కోహ్లీలాంటి అబ్బాయి కావాలని పేర్కొంది. ఇలాంటి చిన్న చూపుతో తాను విసిగిపోయానని పేర్కొంది. వాస్తవం ఏంటో తనకు, తన ఆత్మీయులకు తెలుసు అని పేర్కొంది. తనకు క్రికెటర్లతో డేటింగ్ చేసే ఉద్దేశం లేదని స్పష్టం చేసింది. 'ఇది నా వృత్తి. నా ప్రొఫెషన్, వ్యక్తిగత జీవితాన్ని కలిపే ఉద్దేశం అస్సలు లేదు. అందుకే క్రికెటర్లతో డేటింగ్ చేసే ఆలోచన నాకు లేదు. నాకు విరాట్ కోహ్లీ లాంటి భాగస్వామి కావాలి. అతను ఎంత బిజీగా ఉన్నా అనుష్క పట్ల చూపించే ప్రేమ, అంకితభావం, ఆరాధన నాకు చాలా ఇష్టం. నా భాగస్వామి నాతో ఉన్నప్పుడు పూర్తిగా నాకే సమయం కేటాయించాలి. నాపైనే పూర్తి శ్రద్ద పెట్టాలి. నా పార్ట్‌నర్‌కు లగ్జరీల కంటే ప్రేమించే మనసు,నన్ను కేర్ చేసే గుణం ఉంటే చాలు. ప్రస్తుతానికి ప్రేమ, పెళ్లి లాంటి విషయాల కంటే నా కెరీర్‌కే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాను. 'అని షెఫాలీ బగ్గా చెప్పుకొచ్చింది. ఐపీఎల్ లాంటి ప్రతిష్టాత్మక టోర్నీలకు యాంకర్‌గా వ్యవహరిస్తున్న షెఫాలీ.. త్వరలో బాలీవుడ్, సౌత్ ఇండియన్ సినిమాలతో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాల వివరాలను త్వరలోనే అధికారికంగా ప్రకటించనుంది.





# చిక్కుల్లో యూసఫ్ పఠాన్

మహానగరం ముంబైలోని బైకుల్లా ప్రాంతంలో జరిగిన ఒక చిన్న వివాదం చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు పోలీసు కేసులకు దారితీసింది. టీమ్ ఇండియా మాజీ ఆటగాడు యూసుఫ్ పఠాన్ మామ, ఆయన కుమారుడు మరియు మరో బంధువు కలిసి ఒక వ్యక్తిపై, అతని కుటుంబంపై దాడి చేశారనే ఆరోపణలతో ముంబై పోలీసులు వారిని అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. ఈ గొడవ రెండు రోజుల క్రితం ప్రారంభమైంది. ముంబైలో కురిసిన వర్షాలకు రోడ్లపై గుంతల్లో నీరు చేరింది. ఆ దారిలో వెళ్తున్న ఒక కారు, గుంతలోని నీటిని రోడ్డు పక్కన ఉన్న వ్యక్తిపై చిమ్మింది. ఈ చిన్న కారణంతో ఆగ్రహానికి గురైన నిందితులు, కారులో ఉన్న వ్యక్తితో వాగ్వాదానికి దిగారు. అది కాస్తా ముదిరి పరస్పర దాడుల వరకు వెళ్లింది. ఈ ఘటనపై బాధితులు ఫిర్యాదు చేయడంతో రంగంలోకి దిగిన బైకుల్లా పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. విచారణలో భాగంగా పోలీసులు పలు కీలక ఆధారాలను సేకరించారు.ఘటనా స్థలంలో ఉన్న సీసీటీవీ కెమెరాల ద్వారా నిందితులను స్పష్టంగా గుర్తించారు.దాడికి ఉపయోగించిన వెదురు కర్రలు, బేస్ బాల్ బ్యాట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై భారతీయ న్యాయ సంహిత లోని సెక్షన్ 118(2), 115(2), 324, 352, 351(2), మరియు 3(5) కింద కేసులు నమోదు చేశారు.ప్రస్తుతం ముగ్గురిని అరెస్ట్ చేయగా, ఈ కేసులో మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సమాచారం. నిందితులను కోర్టులో హాజరుపరిచినప్పుడు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు మరియు సీసీటీవీ ఫుటేజ్ తమ వద్ద బలంగా ఉన్నాయని పోలీసులు కోర్టుకు వివరించారు. ప్రస్తుతం ఎన్నికల ప్రచార పర్వం కొనసాగుతున్న తరుణంలో,ఒక సిట్టింగ్ ఎంపీ అయిన యూసుఫ్ పఠాన్ బంధువులు ఇలాంటి గొడవల్లో అరెస్ట్ కావడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రత్యర్థి పార్టీలు ఈ అంశాన్ని ప్రచారంలో ప్రస్తావించే అవకాశం కనిపిస్తోంది.నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్, ఒత్తిడి వల్ల చిన్న చిన్న కారణాలకే ప్రజలు విచక్షణ కోల్పోయి దాడులకు దిగడం ఆందోళన కలిగిస్తోంది. రోడ్డుపై వెళ్లేటప్పుడు సహనం పాటించకపోతే, అది ఎంతటి వారినైనా చట్టం ముందు నిలబెడుతుందని ఈ ఘటన మరోసారి నిరూపించింది. పోలీసులు పరారీలో ఉన్న మరో వ్యక్తి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

# అదరగొట్టిన అభిషేక్

## 68బంతుల్లో 135పరుగులు
## ఈషన్‌కు నాలుగు, హర్ష్‌కు మూడు వికెట్లు
## ఢిల్లీపై సన్‌రైజర్స్ ఘన విజయం



హైదరాబాద్: సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు మరోసారి ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడారు. రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో అభిషేక్ శర్మ(135నాటౌట్) సెంచరీకి తోడు హెడ్(37), ఇషాన్ కిషన్(25), క్లాసెన్(37నాటౌట్) ధనా ధన్ ఇన్నింగ్స్‌తో మెరిసారు. దీంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 2వికెట్ల నష్టానికి 242పరుగులు చేసింది. భారీ ఛేదనలో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్ నిర్ణీత ఓవర్లు ముగిసేసరికి 9 వికెట్ల నష్టానికి 195 పరుగులే చేసి ఓటమిపాలైంది. దీంతో సన్‌రైజర్స్ 47 పరుగుల తేడాతో గెలిచి పాయింట్ల పట్టికలో 3వ స్థానానికి ఎగబాకింది. భారత ఛేదనలో ఢిల్లీ బ్యాటర్లు నితీశ్ రాణా(57), సమీర్ రిజ్వీ(41), కెఎల్ రాహుల్(37) మాత్రమే బ్యాటింగ్‌లో రాణించగా.. సన్‌రైజర్స్ బౌలర్లు ఈషన్ మలింగకు నాలుగు, హర్ష్ దూబేకు మూడు వికెట్లు దక్కాయి. హర్ష్ దూబే వేసిన చివరి ఓవర్లో మూడు వికెట్లు సాధించడం విశేషం.

టాస్ గెలిచిన ఢిల్లీ కెప్టెన్ అక్షర్ పటేల్ బౌలింగ్ ఎంచుకోగా.. హైదరాబాద్ ఇన్నింగ్స్‌ను అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ ప్రారంభించారు. ఆరంభం నుంచే అభిషేక్ ఢిల్లీ బౌలర్లను సమర్ధవంతంగా నిలువరించాడు. మైదానం నలువైపులా క్లాస్ షాట్లతో విరుచుకుపడ్డాడు. కేవలం 68 బంతులు ఎదుర్కొన్న ఈ యువ సంచలనం, ఏకంగా 10 ఫోర్లు, 10 భారీ సిక్సర్లతో 198.53 స్ట్రైక్ రేటుతో 135 పరుగులు చేసి ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు. ఇది ఈ సీజన్‌లో అతనికి ఇదే తొలి శతకం. ఇన్నింగ్స్ ఆరంభం నుంచి చివరి బంతి వరకు క్రీజులో నిలబడి, జట్టుకు భారీ స్కోరును అందించడంలో కీలక పాత్ర పోషించాడు. మరో ఎండ్‌లో ట్రావిస్ హెడ్ (37; 26బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లు), ఇషాన్ కిషన్ (25; 13బంతుల్లో 2ఫోర్లు, సిక్సర్) వేగంగా ఆడి అభిషేక్‌కు చక్కటి సహకారం అందించారు. హెడ్‌తో కలిసి తొలి వికెట్‌కు 97 పరుగులు, ఇషాన్‌తో కలిసి రెండో వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యాలను నెలకొల్పడంలో అభిషేక్ కీలక పాత్ర పోషించాడు. ఇషాన్ కిషన్ దురదృష్టవశాత్తు రనౌట్‌గా వెనుదిరిగాడు. ఒక దశలో సన్‌రైజర్స్ స్కోరు 250 పరుగులు సులభంగా దాటుతుందని అనిపించింది. అయితే, చివరి ఐదు ఓవర్లలో పరుగులు రాబట్టడంతో సన్‌రైజర్స్ బ్యాటర్లు విఫలమయ్యారు. చివర్లో క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ (37నాటౌట్; 3ఫోర్లు, 3సిక్సర్లు) తనదైన శైలిలో ఢిల్లీ బౌలర్లపై విరుచుకుపడటంతో స్కోరు 240 మార్కును దాటింది. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ ఒక వికెట్ దక్కింది.

# క్రికెట్‌లో బిష్ణోయ్ గ్యాంగ్ కలకలం

క్రికెట్ ప్రపంచంలో మరో కలకలం రేగింది. పవిత్రమైన క్రీడగా భావించే క్రికెట్‌లో మాఫియా అడుగుపెట్టిందన్న వార్త క్రీడాభిమానులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. టీ20 వరల్డ్ కప్ 2026 వేదికగా సాగుతున్న ఈ కుంభకోణంలో కెనడా జాతీయ జట్టు కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే ఇక్కడ విస్తుపోయే విషయం ఏమిటంటే... ఈ ఫిక్సింగ్ వెనుక భారత మోస్ట్ వాంటెడ్ గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ ముఠా హస్తం ఉందని అంతర్జాతీయ మీడియా కోడై కూస్తోంది. ఐసీసీ యాంటీ కరప్షన్ యూనిట్ ఇప్పటికే రంగంలోకి దిగి విచారణను వేగవంతం చేసింది.కెనడియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ కథనం ప్రకారం.. జూలై 2025లో బ్రిటిష్ కొలంబియాలోని ఒక రెస్టారెంట్‌లో జరిగిన సంఘటన ఈ కుంభకోణానికి పునాది వేసింది. అక్కడ భోజనం చేస్తున్న కెనడా జాతీయ జట్టు స్టార్ ప్లేయర్ దగ్గరకు ఇద్దరు వ్యక్తులు వచ్చి, తాము బిష్ణోయ్ గ్యాంగ్ ప్రతినిధులమని పరిచయం చేసుకున్నారట. దిల్‌ప్రీత్ బజ్వాను జట్టులోకి తీసుకోవడమే కాకుండా, అతన్ని కెప్టెన్‌గా నియమించడానికి మద్దతు ఇవ్వాలని, లేదంటే అతని కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించినట్లు సమాచారం. గన్ పాయింట్ బ్లాకులో పెట్టి బెదిరించి జట్టు కెప్టెన్‌ను మార్చడం క్రికెట్ చరిత్రలో ఇదే తొలిసారి కావచ్చు. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో కెనడా కెప్టెన్ దిల్‌ప్రీత్ బజ్వా బౌలింగ్ చేసిన ఒక ఓవర్ విపరీతమైన అనుమానాలకు తావిచ్చింది. ఆ ఓవర్‌లో అతను అనూహ్యంగా పరుగులు ఇచ్చుకోవడం, బౌలింగ్ శైలి అనుమానాస్పదంగా ఉండటంతో ఐసీసీ అధికారులు అప్రమత్తమయ్యారు. స్పాట్ ఫిక్సింగ్ జరిగిందన్న బలమైన అనుమానంతో బజ్వా మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసి, అతనిపై విచారణ చేపట్టారు. ఈ క్రమంలోనే గ్యాంగ్‌స్టర్లతో అతనికి ఉన్న లింకులు బయటపడుతున్నాయి. జైలులో ఉంటూనే నెట్‌వర్క్ నడిపే బిష్ణోయ్, ఇప్పుడు క్రికెట్ బెట్టింగ్ మాఫియాలోకి కూడా ప్రవేశించాడని రిపోర్టులు చెబుతున్నాయి.కేవలం ఆటగాళ్లే కాకుండా, క్రికెట్ కెనడా ప్రెసిడెంట్ అరవిందర్ ఖోసా కూడా ఈ ముఠాకు సహకరిస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయి. దిల్‌ప్రీత్ బజ్వాను కెప్టెన్ చేయడంలో ఖోసా కీలక పాత్ర పోషించారని, ఇది కేవలం మ్యాచ్‌లు ఫిక్స్ చేసి డబ్బు సంపాదించడానికే అని కొందరు బోర్డు సభ్యులు ఆరోపిస్తున్నారు.





బుధవారం 22 ఏప్రిల్ 2026

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

# ప్యారడైజ్ కోసం రెండేళ్లు

## నటి కాయదు లోహర్ సంచలన నిర్ణయం



తెలుగు సినీ పరిశ్రమలో ఒకే సినిమాకు ఏళ్ల తరబడి సమయం కేటాయించడం అరుదైన విషయం. గతంలో బాహుబలి వంటి భారీ ప్రాజెక్ట్ కోసం అనుష్క శెట్టి తన కెరీర్‌లో ఐదు సంవత్సరాలను కేటాయించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అదే తరహాలో యువ నటి కాయదు లోహర్ కూడా సాహసోపేత నిర్ణయం తీసుకున్నట్లు కనిపిస్తోంది. నేచురల్ స్టార్ నాని హీరోగా తెరకెక్కుతున్న 'ప్యారడైజ్' సినిమా కోసం కాయదు లోహర్ దాదాపు రెండేళ్లుగా మరే ఇతర ప్రాజెక్ట్‌కి కమిట్ కాకుండా పూర్తిగా ఈ ఒక్క సినిమాపైనే దృష్టి పెట్టింది. ఎదుగుతున్న హీరోయిన్ ఇలాంటి నిర్ణయం తీసుకోవడం పెద్ద రిస్క్‌గా సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవల కాయదు లోహర్ నటించిన కొన్ని సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అలాంటి సమయంలో కొత్త అవకాశాలను పక్కన పెట్టి ఒక్క ప్రాజెక్ట్‌పైనే ఆధారపడటం ఆమె కెరీర్‌కు సవాల్‌గా మారవచ్చని విశ్లేషకులు అంటున్నారు. ఒకవేళ 'ప్యారడైజ్' ఆశించిన స్థాయిలో హిట్ కాకపోతే, దాని ప్రభావం ఆమె భవిష్యత్తుపై పడే అవకాశముంది. అయితే ఈ సినిమాలో కాయదు పాత్ర కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, నటనకు మంచి స్కోప్ ఉన్నట్టుగా తెలుస్తోంది. భావోద్వేగపూరిత సన్నివేశాల్లో తన ప్రతిభను చూపించే మంచి ఛాన్స్ ఆమెకు దక్కిందని సమాచారం. ఇదే కారణంగా ఆమె ఈ ప్రాజెక్ట్‌కి అంత సమయం కేటాయించినట్లు తెలుస్తోంది. నాని వంటి ప్రతిభావంతుడితో స్క్రీన్ షేర్ చేసుకోవడం కూడా కాయదు కెరీర్‌కు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ సినిమా సక్సెస్ అయితే, కాయదు లోహర్‌కు పెద్ద బ్రేక్ వచ్చే అవకాశం ఉంది. మరోవైపు పరిశ్రమలో వరుస సినిమాలు చేయడం కూడా నటీమణుల కెరీర్‌కు ముఖ్యమే. ఒకే ప్రాజెక్ట్‌పై ఎక్కువ కాలం ఆధారపడితే ఇతర అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుంది. గతంలో 'సైజ్ జీరో' కోసం అనుష్క తీసుకున్న రిస్క్ తర్వాత ఆమె కొంతకాలం గ్యాప్ తీసుకోవాల్సి వచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాయదు లోహర్ తీసుకున్న ఈ నిర్ణయం సక్సెస్ అవుతుందా లేదా అనేది ఆసక్తికరంగా మారింది. 'ప్యారడైజ్' విడుదల తర్వాత ఆమె టాలీవుడ్‌లో టాప్ లీగ్‌లో చేరుతుందా అనే ప్రశ్నకు సమాధానం దొరకనుంది.




## జూన్ 11న డ్రాగన్ విడుదల

ఎన్టీఆర్ కథానాయకుడిగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా రానున్న డ్రాగన్ చిత్రం కొత్త విడుదల తేదీని నిర్మాణ సంస్థ తాజాగా ప్రకటించింది. ఈ సినిమాను వచ్చే ఏడాది జూన్ 11న విడుదల చేయనున్నట్లు తెలిపింది. తుపాను తన లక్ష్యాన్ని కనుగొంది. 2027 జూన్ 11న థియేటర్‌లలో తుపాను రావడం ఖాయం అంటూ కొత్త విడుదల తేదీతో పాటు ఓ అప్‌డేట్‌ను పంచుకుంది. మే 20న ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు తెలిపింది. మొదట ఈ సినిమాను ఈ ఏడాది సంక్రాంతికి విడుదల చేయాలని మేకర్స్ భావించారు. భారీస్థాయిలో ఈ ప్రాజెక్ట్ తెరకెక్కుతుండడంతో దీన్ని ఈయేడాది జూన్ 25కు వాయిదా వేశారు. అయితే ఇంకా షూటింగ్ పూర్తికాకపోవడం.. పోస్ట్ ప్రొడక్షన్ పనులు మిగిలిఉండడంతో ఇప్పుడు వచ్చే ఏడాదికి వాయిదా వేశారు. ప్రశాంత్ నీల్ మేకింగ్ విషయంలో ఎక్కడా రాజీపడకుండా దీన్ని రూపొందిస్తున్నారు. సినిమా ఆలస్యమైనా.. అభిమానులు కోరుకునేలా ఉండేలా చూస్తున్నారు.ఈ చిత్రంలో ఎన్టీఆర్‌కు జోడీగా రుక్మిణీ వసంత్ నటిస్తున్నారు. 'డ్రాగన్' అనే పేరు ప్రచారంలో ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్మిస్తోన్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ తన లుక్ మార్చుకున్నారు. బరువు తగ్గి నాజూగ్గా కనిపిస్తున్నారు. ఇటీవల తన జిమ్ ఫొటో విడుదల చేయగా అది వైరల్ అయింది. దీంతో సినిమాపై భారీ అంచనాలు

## శివాజీ చరిత్ర ఆధారంగా రాజా శివాజీ

మరాఠా యోధుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ వీరగాథను వెండితెరపై ఆవిష్కరిస్తూ రితేష్ దేశ్‌ముఖ్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న 'రాజా శివాజీ' చిత్రం ప్రస్తుతం దేశవ్యాప్తంగా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో భారీ బ్జడెట్‌తో రూపొందుతున్న ఈ చారిత్రక చిత్రానికి రితేష్ దేశ్‌ముఖ్ స్వయంగా దర్శకత్వం వహిస్తుండగా, ఆయన భార్య జెనీలియా దేశ్‌ముఖ్ తన సొంత నిర్మాణ సంస్థ ముంబై ఫిల్మ్ కంపెనీ మరియు జియో స్టూడియోస్ భాగస్వామ్యంతో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమా మే 1న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ ట్రైలర్ చూస్తుంటే భారీ విజువల్స్ మరియు పవర్‌ఫుల్ డైలాగ్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచేశాయి. ఈ చిత్రంలో బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ ఒక కీలకమైన ప్రతినాయక పాత్రలో కనిపించబోతున్నట్లు సమాచారం. శివాజీ మహారాజ్ స్వరాజ్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన సాహసాలను ఎంతో గ్రాండ్‌గా చూపించబోతున్న ఈ సినిమాను మరాఠీ మరియు హిందీ భాషల్లో ప్రధానంగా రూపొందించారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ చిత్రం మహారాష్ట్ర దినోత్సవం సందర్భంగా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. గతంలో 'వేద్' వంటి భారీ విజయాలను అందుకున్న రితేష్-జెనీలియా కాంబో ఈ చారిత్రక చిత్రంతో మరోసారి బాక్సాఫీస్ వద్ద తమ సత్తా చాటడానికి సిద్ధమవుతున్నారు






## నేను మలయాళీని కాదు.. తమిళ అమ్మాయిని

తన మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పానన్న పల్లవి ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం తనకు లేదని వ్యాఖ్య

టాలెంట్, సహజమైన నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న సాయి పల్లవి, ప్రస్తుతం బాలీవుడ్‌లో రణబీర్ కపూర్ సరసన 'రామాయణ' చిత్రంలో సీతగా నటిస్తూ బిజీగా ఉంది. అయితే, కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నా, గతంలో తాను చేసిన ఒక వ్యాఖ్యను కొందరు వక్రీకరించడంపై తాజాగా ఆమె స్పందిస్తూ ఆవేదన వ్యక్తం చేసింది.

అసలు ఏం జరిగిందంటే... దాదాపు నాలుగేళ్ల క్రితం ఒక ప్రెస్ మీట్‌లో, "మీరు మలయాళీలు అయి ఉండి తమిళం ఇంత బాగా ఎలా మాట్లాడుతున్నారు?" అని ఒక రిపోర్టర్ ప్రశ్నించారు. దానికి సాయి పల్లవి సమాధానమిస్తూ, "నేను తమిళ అమ్మాయిని, మలయాళీని కాదు" అని స్పష్టం చేసింది. అయితే, రెండేళ్ల తర్వాత కొందరు ఈ మాటలను వక్రీకరించి, "మలయాళీ అని పిలిచినందుకు సాయి పల్లవికి కోపం వచ్చింది" అంటూ తప్పుడు ప్రచారం చేశారు.

ఈ ప్రచారంపై తాజాగా ఆమె స్పందిస్తూ.. "ఆ హెడ్‌లైన్ చూసి నేను షాక్‌కు గురయ్యాను. నేను అనని మాటలను నాపై మోపడం బాధాకరం. నేను కోయంబత్తూరులో పుట్టి పెరిగాను, నా మాతృభాష తమిళం అని మాత్రమే చెప్పాను. ఏ భాషను తక్కువ చేసే ఉద్దేశం నాకు లేదు" అని సాయి పల్లవి వివరణ ఇచ్చింది.

## 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల

కాళీ క్రాఫ్ట్స్ మరియు నిర్మలం డ్రామాస్ బ్యానర్లపై సుబ్బా మాధవరపు దర్శకత్వంలో రూపొందిన 'సూర్య బి పాజిటివ్' చిత్ర టీజర్ విడుదల వేడుక హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ దర్శకులు కౌశిక్ పెగల్లపాటి (కిష్కింధపురి ఫేమ్), మురళీకాంత్ దేవసోత్ (దండోరా ఫేమ్) ముఖ్య అతిథులుగా హాజరై చిత్ర టీజర్‌ను ఆవిష్కరించారు. చరణ్ పీసర్ల హీరోగా నటిస్తూ డైలాగ్స్ రాయడంలోనూ పాలుపంచుకున్న ఈ చిత్రంలో యానీ దయానా, దివ్య విశ్వకర్మ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజర్ ఆవిష్కరణ అనంతరం ముఖ్య అతిథిగా వచ్చిన మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ఒక సినిమాను నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని, అమెరికాలో ఉద్యోగం చేస్తూనే సుబ్బా మాధవరపు ఇక్కడికి వచ్చి పట్టుదలతో ఈ సినిమాను పూర్తి చేయడం అభినందనీయమని కొనియాడారు. టీజర్‌లోని విజువల్స్, నటీనటుల ప్రతిభ సినిమాపై ఆసక్తిని కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. మరో అతిథి కౌశిక్ పెగల్లపాటి మాట్లాడుతూ, చరణ్ తనకు కాలేజీ జూనియర్ అని, హీరోగా గుర్తింపు తెచ్చుకోవాలనే తపన అతనిలో బలంగా ఉందని అన్నారు. టీజర్ ఎడిటింగ్ స్టైల్ చాలా ప్రత్యేకంగా ఉందని, ఒక సామాన్యుడి కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న తీరు ప్రేక్షకులను మెప్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో చరణ్ పీసర్ల తన ప్రసంగంలో ఉద్వేగానికి లోనయ్యారు. గతంలో మూడు సినిమాలు చేసినా అవి విడుదల కాలేదని, ఈ నాలుగవ ప్రయత్నం ద్వారా నటుడిగా ప్రేక్షకుల నుంచి అర్హతను ఆశిస్తున్నానని తెలిపారు. నటి సుజాత దీక్షిత్ మాట్లాడుతూ, తన నిజస్వరూపానికి భిన్నంగా ఈ చిత్రంలో నిశ్శబ్దంగా ఉంటూ కళ్ళతో పలికించే పాత్రను దర్శకుడు తనతో చేయించారని తెలిపారు. హీరోయిన్లు యానీ దయానా, దివ్య విశ్వకర్మ తమకు తెలుగు రాకపోయినా చిత్ర బృందం ఎంతో సహకరించిందని, ఇదొక మంచి అనుభూతిని ఇచ్చిందని అన్నారు. బలగం సత్య, లిరిసిస్ట్ రాంబాబు గోసాల కూడా చిత్ర విజయానికి తమ ఆకాంక్షలను తెలియజేశారు. త్వరలోనే ఈ చిత్రం థియేటర్లలో ప్రేక్షకులను పలకరించనుంది.




## జైలర్-2 షూటింగ్ పూర్తి

సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న 'జైలర్ 2' సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ తెరకెక్కిస్తున్న ఈ భారీ ప్రాజెక్ట్ గురించి తాజాగా కీలక అప్‌డేట్ వెలువడింది. చిత్ర బృందం అధికారికంగా షూటింగ్ పూర్తయిందని ప్రకటించడంతో, అభిమానుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. షూటింగ్ పూర్తయిన సందర్భంగా చిత్ర యూనిట్ రజనీతో కలిసి కేక్ కట్ చేసి సెలబ్రేషన్స్ జరుపుకుంది. ఈ సందర్భంగా బయటకు వచ్చిన ఫోటోలు, వీడియోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలోకి ప్రవేశించింది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు వేగంగా పూర్తి చేస్తే, సినిమా అనుకున్న సమయానికి ముందే విడుదలయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం అధికారిక విడుదల తేదీని ప్రకటించలేదు.




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613